హనీబీఎపి

సంపుటి 4, సంచిక 1

జులై - సెప్టెంబర్ 2009

# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక




## ఆలేరు నివాసి మల్లేశంకు ప్రథమ జాతీయ పురస్కారం





# 'హనీబీఏపి' ప్రగతి



'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ, హనీబీ నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. ఎన్.ఐ.ఎఫ్. సంస్థకు, ఆధ్రప్రదేశ్‌లోని మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్త లతో సంధానం చేయడం ఈ సంస్థ మూల కార్యక్రమం.

నవంబర్ 2005 లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.యల్. రావు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గార్ల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారిని ఆదర్శంగా తీసుకుని వారి మహత్తర జ్ఞాన ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమై 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతో మంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడిచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరితోడు, శుభాకాం క్షలు ఈ స్వల్ప కాలంలో 'హనీబీ' పునాదులను పటిష్టం చేశాయి.

ఇంతవరకు హనీబీఏపి చేపట్టి సాధించిన వివిధ కార్యక్రమాలు :

✤ 74 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణ లను, ఆలోచనలను ఎన్ఐఎఫ్‌లో రిజిష్టర్ లో చేయడం జరిగింది.

✤ నలుగురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామిక వేత్తలకు అందించి, ఆర్థిక ఒప్పందం కుదుర్చడమైనది.

✤ ఒక ఆవిష్కరణ కార్యరూపం దాల్చుటకు, టెస్టింగ్‌కు టి.ఐ.పి.పి. ద్వారా నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం.

✤ కారంచేడులో జరిగిన జాతీయ గ్రామీణ ప్రగతి ప్రదర్శనలో 28 మంది ఇన్నోవేటర్లు పాల్గొని విజయవంతం చేశారు.

✤ నిజామాబాద్ ప్రాంతంలో మినీ శోధయాత్ర నిర్వహించి, ఏడుమంది పల్లె ఇన్నోవేటర్లను వెలికి తీయడం జరిగింది.

✤ ఇప్పటి వరకు 12 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది..

✤ తెలుగు పల్లె జ్ఞానం దోమలను చంపే హెర్బల్ మందును ఎన్.ఐ.ఎఫ్. శాస్త్రీయంగా నిర్ధారించడం.

✤ హైదరాబాద్‌లో జనవరి 2008 ఉద్యాన వనశాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రదర్శనలో 8 మంది తెలుగు ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించగా ఎంతోమంది వాటిని మెచ్చుకోవడం జరిగింది.

✤ జనవరి 2008లో విశాఖలో జరిగిన 95వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ముగ్గురు ఇన్నోవేటర్లు పాల్గొని ప్రశంసలు పొందారు.

✤ ప్రప్రథమంగా ఆంధ్రప్రదేశ్‌లోని అరకు లోయలో శోధయాత్రను జనవరిలో నిర్వహించి, స్థానిక జ్ఞానాన్ని సేకరించడం జరిగింది.

✤ అలేరు నివాసి, ఉత్తమ ఇన్నోవేటర్ చింతకింది మల్లేశం అహమ్మదాబాద్‌లో జరిగిన జాతీయ ఇన్నోవేషన్ సమావేశానికి ఆహ్వానించబడ్డారు.

✤ నెల్లూరులో ఆదిశంకర విద్యా సంస్థలో 'జరిగిన టెక్నాలజీ మేళా'లో 19 మంది ఇన్నోటర్లు పాల్గొనటం జరిగింది.

✤ 'పల్లెసృజన' త్రైమాసిక పత్రికను విజయవంతంగా ప్రచురిస్తూ మూడవ సంవత్సరంలోకి అడుగు పెట్టడం.

✤ 'టెప్' విజ్ఞాన సాంకేతిక విభాగం కేంద్ర ప్రభుత్వం ద్వారా 8 ఇన్నోవేటర్లకు ఆర్థిక సహాయానికి తోడ్పడటం.

✤ ఎన్.ఐ.టి. వరంగల్‌లో నలుగురు ఇన్నోవేటర్లు 'ఇన్నోవేటర్ల సమావేశం'లో పాల్గొనటం.

✤ వెయ్యికి పైగా సాంప్రదాయ జ్ఞానాన్ని సేకరించి ఎన్.ఐ.ఎఫ్.కు పంపడం.

✤ దాదాపు తొమ్మిది మంది ఇన్నోవేటర్లకు తమ ఆలోచనలను కార్యరూపం చేయటానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించటం.

✤ ఇన్నోవేటర్లకు జాతీయ వ్యవసాయ పరిశోధన, సాంకేతిక విజ్ఞాన మేనేజ్ మెంట్ (నారమ్) లో వివిధ 'సెమినార్ల'లో శిక్షణా కార్యక్రమాల్లో అతిథిగా పాల్గొనేట్లు చేయటం.

✤ 16 మంది 'బిట్స్ పిలాని' విద్యార్థులతో వరంగల్ జిల్లా ఏటూరునాగారం, తొర్రూరు మండలాల్లోని పది గ్రామాల్లో 'జ్ఞానశోధ' చేయడం.

✤ జాతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (నారమ్) నుండి 16 మంది పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమా విద్యార్థులు నల్లమల అడవుల్లో నాలుగు చెంచుల గ్రామాలను సెప్టెంబర్ 2009లో జ్ఞాన సేకరణ చేయడం.

✤ చింతకింది మల్లేశం ఆసు మిషన్‌కు, నరసింహాచారి కాలిపోయిన ట్యూబ్‌లైట్లను వెలిగించే పరికరానికి ప్రొవిజనల్ పేటెంట్ పొందడం.

✤ ఇష్వాక్, లింగ బ్రహ్మంల పేటెంట్ కేసులను ఫైలు చేయడం.

✤ చింతకింది మల్లేశం పరిశోధనకుగాను రాష్ట్రపతి ద్వారా ప్రథమ జాతీయ పురస్కారం లభించింది.

**మా కలలు :**

✤ ఏడవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.

✤ కనీసం నలుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించడం.

✤ పల్లెజ్ఞానవేత్తల ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తేవడం

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి. ప్రోత్సహించండి – పాల్గొనండి – ఆవిష్కరించండి.

**– బ్రిగేడియర్ పి. గణేశం,**
కో–ఆర్డినేటర్, హనీబీఏపి,
ఫోన్ : 98660 01678.

# పల్లెసృజన

సంపుటి-4 సంచిక - 1 జులై - సెప్టెంబర్ 2009



**సంపాదకవర్గం**

సంపాదకులు :

**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సలహాదారులు :

**డా. కె.ఎల్. రావు**
**ప్రొ. అనిల్ గుప్త**
**డా. గీర్వాణి**
**శ్రీ పి. చంద్రకాంత్ శర్మ**
**డా. వై.వి. రావ్**
**శ్రీమతి అరుణ గణేశం**
**పల్లె వీర రాఘవ రెడ్డి**

డి.టి.పి. & డిజైనింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.**
ఫోన్ : 040- 42215350
సెల్ : 93913 75655, 92468 20655
E-mail : narendragrafix@gmail.com

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన
102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555
E-mail : honeybeeap@gmail.com


## ఈ సంచికలో...


- ❖ 'హనీబీ' నెట్‌వర్క్ ఒక చురుకైన సామాజిక శక్తి- 3
- ❖ ఎన్.ఐ.ఎఫ్. 5వ జాతీయ పురస్కారాలు- 4
- ❖ తమిళనాడులోని తిరుచి జిల్లాలో 'పచ్చై మలై' వాసులైన కొండజాతి వారు అనుసరించే సాంప్రదాయ పద్ధతులు- 7
- ❖ పక్షులు - మానవాళి- 10
- ❖ జీవన విధానంలో మార్పు రావాలి!- 12
- ❖ గ్రామీణ సృజనాత్మకతను పట్టించుకోని సమాజం - 16
- ❖ ఉప్పు పాటలు - ఉప్పు పనివారితో అడుగులు- 17
- ❖ అపురూప శతాబ్ది సహచరులు జివిబెన్-హర్ఖ భాయి మక్వానా - 21
- ❖ రిమోట్ మోటార్ స్టార్టర్- 24
- ❖ ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు - 26
- ❖ స్పందన - 27


**కవర్ లోపలి పేజీల్లో :**

హనీబీఏపి ప్రగతి

**'శానిటరీ న్యాప్‌కిన్స్' తయారు చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకి ఆరోగ్యంతో పాటు వ్యాపారం కూడా.....!!**

**సెంటర్ స్ప్రెడ్**

**వరంగల్, హైదరాబాద్‌లలో విద్యార్థుల ఇన్నోవేషన్ క్లబ్బుల ఆవిష్కరణ**


## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
45, TPM Nagar,
Virattipathu - 625 010. Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in



Printed & Published by : Brig. P. Ganesham, VSM (Poorva Senani), on behalf of "HoneyBeeAP"
102, Vayupuri, Sainikpuri Post, Secunderabad - 500 094. A.P.
Ph.: 040-27118555, Cell : 0 98660 01678. Printed at : Narendra Grafix, Chikkadpally, Hyderabad. Ph. : 93913 75655

# సంపాదకీయం

ఇంత త్వరగా మా కలలు ఫలిస్తాయని మేము నిజంగా ఊహించలేదు. 19 నవంబర్, 2009 మన తెలుగు సృజనాత్మక శక్తికి ఒక మైలురాయి మన ఆలేరు సమీప గ్రామవాసి, చేనేత కార్మికుడు చింతకింది మల్లేశం భారత రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభా పాటిల్ చేతులమీదుగా సత్కరింపబడ్డాడు. ఆయన 'ఆసుమిషన్' గురించి పాఠకులకు విదితమే. తల్లి కష్టాలను నివారించడానికై మల్లేశం చేసిన ప్రయత్నాన్ని అఖండ భారతం గుర్తించి ఆయనకు జాతీయ ప్రథమ బహుమతిని ఇచ్చి సత్కరించింది.

హనీబీఏపి కి ఆరోజు ఒక పెద్ద పండుగ. మేమంతా చేస్తున్న ఈ మహాయుద్ధంలో లభించిన మొట్టమొదటి లబ్ది. తెలుగు గ్రామీణ మేధకు మరిన్ని ఇలాంటి సత్కారాలు లభిస్తాయని మేము దృఢంగా విశ్వసిస్తున్నాము.

హనీబీఏపి మల్లేశం ఆసు మిషన్‌ను 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్'లో జరిగిన ఒక అంతర్జాతీయ సదస్సులో ప్రదర్శించింది. మల్లేశానికి ఆయన ప్రయత్నాలకు అందరూ హర్షం వ్యక్తం చేశారు. మరొక శుభవార్త యు.యస్.ఎ.కు చెందిన 'యం.ఐ.టి. ఫ్యాబ్ ల్యాబ్స్' ఆసు మిషన్‌ను ఆసియా ఖండంలో ఉత్తమ గ్రామీణ ఇన్నోవేషన్‌గా గుర్తించింది. స్పెయిన్‌లో జరుగనున్న అంతర్జాతీయ పోటీలో మల్లేశం పాల్గొనడానికి అవకాశం త్వరలో రానున్నది. దేశంలోని ప్రధాన ప్రదర్శనలలో విద్యాశాలల్లో ఇతర సదస్సుల్లో ఆసుమిషన్ పాల్గొన్నది. రాష్ట్రపతి భవన్‌లో మార్చి, 2010లో జరుగనున్న ఇన్నోవేషన్ ప్రదర్శనలో మల్లేశం ఆసుమిషన్‌తో పాల్గొనడానికి ఆహ్వానం వచ్చింది.

ఢిల్లీలో జరిగిన బహుమతి ప్రదానానికి మల్లేశంకు ప్రేరణనిచ్చిన తన తల్లి శ్రీమతి లక్ష్మీదేవి కూడా వచ్చి తన కన్న కడుపు సాధించిన అత్యున్నత పురస్కారాన్ని చూసి ఆనందభాష్పాలు రాల్చింది. మల్లేశం భార్య, చిరంజీవులు, ఆయన సోదరుడు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హనీబీఏపి ఇది సాధ్యం కావడానికి అన్ని విధాలా కృషి చేసింది.

అవార్డుల ఆనందం ఒకవైపు - ఇన్నోవేషన్లు మార్కెట్‌లోకి రావడం లేదనే బాధ మరోవైపు. గత మూడున్నరేళ్ళుగా పడిన శ్రమ, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో సంధానం, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలతో సంప్రదింపులు, సమాజ పెద్దలతో సంపర్కం - ఇవన్నీ మా ప్రయత్నాలను సఫలం చయలేక పోయాయి. ఇది మమ్మల్ని ఎంతో అసంతృప్తికి గురి చేస్తున్నా, పట్టువదలని విక్రమార్కుల్లా మా ప్రయత్నాలను, కొత్త విధానాలను కొనసాగిస్తూనే ఉన్నాం. విజయం మమ్మల్ని ఎంతోకాలం వరించకుండా ఉండదుకదా!


ఈ ప్రయత్నంలో పాఠకుల సలహాలు మేము ఎల్లప్పుడూ ఆహ్వానిస్తూనే వుంటాం. మీరెవరైనా మాతో చర్చించాలనుకుంటే మాకు వ్రాయండి. లేదా ఫోన్ చేయండి. మేము మిమ్మల్ని కలుస్తాం. చర్చించి మీనుండి నేర్చుకుని అమలు చేస్తాం.

2010 సంవత్సరంలో మా ధ్యేయం కనీసం అయిదు గ్రామీణ ఆవిష్కరణలను మార్కెట్‌లోకి తీసుకు రావడం. అందుకు మీ ఆశీస్సులు, సలహాలు, సహాయం ఎంతో అవసరం. మాకు తడుగా నిలుస్తారని, మా కలలను నిజం చేయడానికి సహకరిస్తారని మనసారా ఆశిస్తూ.....

భవదీయ

**'బ్రిగేడియర్' గణేశం**

# 'హనీబీ' నెట్‌వర్క్ ఒక చురుకైన సామాజిక శక్తి



**- 'భారత రత్న' ఎ.పి.జె. అబ్దుల్ కలామ్**
**మాజీ రాష్ట్రపతి**

నేను నిజంగా స్ఫూర్తిని పొంది హనీబీ కొరకు ఈ వాక్యాలు వ్రాస్తున్నాను. ఈ పేరు అతికినట్లుగా ఉన్నది. ఎంతోమంది శక్తి సామర్థ్యాలు ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. మూలాల వద్దనైతేనేమి ఒకరితో ఒకరు పరస్పరము మరియు మిగతా సమాజంలోను, సృజనకారులు ఫలితాలకై పాటుపడుతు న్నారు. ఇది మొత్తం జట్టుయొక్క అవిశ్రాంత శ్రమ ఫలితము. ఎంతో గొప్ప పట్టుదల మరియు శ్రమ వలన ఈ జట్టు ఈ మహాకార్యమును సాధించింది. లక్షకు మించిన ఆలోచనలు, సృజనలు మిరయు సాంప్రదాయ అలవాట్లతో నిండిన విస్తారమైన డేటాబేస్ వారి అవిశ్రాంత సాధనకు యోగ్యతా పత్రము మూల సృజనలను కనుగొనే ఈ కార్యాచరణకు నా ధన్యవాదాలు.

భారతదేశము సాంప్రదాయక విజ్ఞానము మరియు వైజ్ఞానిక స్ఫూర్తిగల గొప్ప భూమి. అన్ని యుగాలయందు, అన్ని ప్రాంతాలలో ఈ అద్భుత సంపదతో నిండివున్నది. ఎన్నో సంవత్సరాలుగా హనీబీ ఎంతో ముఖ్యమైన పని చేసింది. వేలకొద్దీ మూల సృజనలను పుస్తకబద్ధం చేసింది. సృజనకారులకు తమ నైపుణ్యాలను ప్రదర్శించుకొనుటకు ఒక విశేషమైన అమూల్యమైన వేదికను అందించినది.

నేను 2009 జనవరి త్రైమాసిక పత్రికలో గుజరాత్‌లోని నూటవది సంవత్సరాల వృద్ధ స్త్రీ – పూరిబెన్ గురించిన వివరాలు చదివాను. ఆమె జీవితంలోని ప్రతి సమస్యకు కొత్త కొత్త పద్ధతులను ఉపయోగించిన ఆ ఎడతెగని స్ఫూర్తి మన మందరము అనుసరించవలసి యున్నది. ఆమె ఎల్లప్పుడూ నిర్మాణాత్మక పనులలో నిమగ్నమై ఉండేది. మనో విచారానికి, ఆందోళనకు దూరంగా ఉండేది. యువతకు ప్రస్తుతం ఎంతో ఉపయోగ కరమైన సందేశము చంపారన్ నుండి ఎన్నో సృజన లను చూచి నేను చాలా సంతోషించాను. ఎలక్ట్రానిక్ ఎలుకల బోను మొదలుకొని మడిచే సైకిల్ వరకు ఇంకా కాలుష్య నివారణ యంత్రం నుండి కాఫీ తయారు చేసే మెషీన్ వరకు విభిన్నమైన సృజనల నుండి విశేషంగా ఆశ్చర్యపడ్డాను. అవసరాలు ఎలా సృజనలకు కారణమౌ తున్నాయో, అందు బాటు ధరలో కొత్త ఉత్పత్తులను తయారు చేయగ లిగే క్రొత్త సృజనలు సాధారణ ప్రజల బాధలను ఎలా తీర్చగలుగుతాయో నేను గమనించాను. ఇది నిజంగా ఒక గొప్ప కార్యము.

ఈ సృజనలను ఏ ప్రదేశములో ఉపయోగములో ఉంచాలి అనేది తదుపరి సవాలు అనుకొంటున్నాను. వారికి వ్యాపార అవకశాలను కనుగొనుటకు తగిన మార్గం ఏమిటంటే గ్రామీణ ప్రాంతాలలో పట్టణ అవకాశాలు కల్పించుట (పురా). ప్రభుత్వ విభాగాలు మరియు ప్రైవేటు కార్పోరేషన్‌ల సహాయ సహకారాల ద్వారా ఇది సాధింప బడుతుంది. ఇప్పటినుండి 2020వ సం. వచ్చేసరికి భారతదేశ మంతటా మొత్తం 6 లక్షల గ్రామాలకు చేరవేయుటకు 7000 పురా కాంప్లెక్స్‌ల అవసరముంది. ప్రతి కాంప్లెక్స్ ఆ ప్రాంత వనరులకు మరియు అవసరాలకు తగినట్లుగా ఉంటాయి. ఈ కార్యాన్ని ముందుకు తీసుకొనిపోవడంలో సృజనల పాత్ర అద్భుత మైనది. సరియైన ధరలకు సేవలందించగల సత్తా ఈ సృజనలకు కలదు. అవి పెద్దమొత్తంలో

సృజనలకు కలదు. అవి పెద్దమొత్తంలో
సమాజ సంక్షేమం కల్పిస్తుంది. ఎంతోమంది ప్రజల జీవితాలను మార్చడంలో ప్రధానమైన పాత్ర పోషిస్తుంది.

సృజనలకు ఆర్థిక లాభాలను ఆయా సృజనకారులకు అందించుటకు మార్గాలను కనుగొనవలసిన అవసరముంది. వ్యాపారికి తన సృజన ఉపయోగము ద్వారా నేరుగా లాభము పొందుటకు ఒక వేదికను కల్పించడం ద్వారానే ఇది నెరవేరుతుంది.

మన సమాజంలోని యువ సృజన కారుల (ఇన్నోవేటర్ల) సామర్థ్యము ఇగ్నైట్ 2009 అవార్డుల ద్వారా గుర్తించడం తెలుసుకొని నేను చాలా ఆనందిస్తున్నాను. ఇది ఎంతో ప్రాముఖ్యమైన సంఘటన. ఇది మన సమాజంలోని యువ వైజ్ఞానిక సృజనకారుల అస్తిత్వాన్ని చాటి చెబుతున్నది. ఇది మన జాతిని ముందు తరంలోకి నడుపుతుంది. ఇందులో పాల్గొన్న వారందరికి ధన్యవాదములు. వీరిచే నిర్మాణింపబడుతున్న భావి భారతదేశ ఔన్నత్యాన్ని చూస్తున్నాను.

●

('హనీబీ' పత్రిక ఆగ్లమూలం)




# ఎన్.ఐ.ఎఫ్. 5వ జాతీయ పురస్కారాలు

**సృజనాత్మకత, కల్పనలో తళుక్కుమన్న తారలు :**

ఎన్.ఐ.ఎఫ్. యొక్క 5వ ద్వైవార్షిక పోటీలకు 31 రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలనుండి 37,000 పైగా సాంప్రదాయక జ్ఞానాలపై ఎంట్రీలు నమోదయ్యాయి. వీటిలో 90 శాతం పైగా మూలికలకు సంబంధించినవే. ఇవి పురస్కార అర్హత పొందాలంటే శాస్త్రీయంగా చట్ట బద్ధతను కలిగి ఉండాలనే షరతు ఉంది. ఈ సాంప్రదాయక మూలికావైద్యాలు ఎంతో ఎక్కువ శక్తి సామర్థ్యాలున్నప్పటికీ, వేలల్లో పోటీకి వచ్చిన వీటిని శాస్త్రీయంగా రుజువు చేయటం సమయాభావం, స్వల్ప వనరుల కారణంగా ఎన్ఐఎఫ్‌కు సాధ్యం కాలేదు. సృజనకారులలో కొందరికి తమ సమస్యలే ప్రేరణ అయితే, మరి కొందరికి తమ తెగలు మరియు ఇతరుల సమస్యల పరిష్కారమే ప్రేరణ అయ్యాయి. ఈ సాంప్రదాయ జ్ఞానాలు కేవలం పురస్కారాల కొరకే కాక, అవి ఆయా ప్రాంతాల ప్రజలకు ఉపయోగపడేవిగా ఉండాలి. పాఠకులు తమకు ఇలాంటి ఆలోచనలున్నా లేదా తమ చుట్టు ప్రక్కల ఇటువంటి ఆలోచనలు తమ దృష్టికి వచ్చినా మాకు తెలియజేస్తారని ఆశిస్తున్నాము.

**పోచంపల్లి చేనేతకార్లకు వరం 'లక్ష్మి ఆసు మిషన్' (ప్రథమ జాతీయ బహుమతి):**

'పల్లెసృజన' పాఠకులకు చింతకింది మల్లేశం చిరపరిచితులే. 36 సంవత్సరాల వయస్సుగల మల్లేశం చదివింది పదవ తరగతి మాత్రమే. తన తల్లి పడుతున్న బాధ నుండి విముక్తి చేయడానికి అతను ఒక సంచలనాత్మక పరికరాన్ని తయారు చేయాలని ఉద్యుక్తుడై దాన్ని సాధించాడు. తద్వారా తన తల్లికే కాదు అంతరించి పోతున్న 'పోచంపల్లి చేనేత' రంగానికే కొత్త ఊపిరిని అందించాడు. 'టై & డై' పద్ధతిలో పోచంపల్లి సిల్కు చీర తయారు కావాలంటే ఒక వ్యక్తి ముఖ్యంగా







స్త్రీలు ఎంతో కష్టపడి ఆ చీర నేయడానికి అవసరమైన దారాన్ని ఒక క్రమమైన పద్ధతిలో దాదాపు ఒక మీటరు కొయ్యకు ముందుకు వెనక్కు చేతిని ఆడిస్తూ ఆ దారాన్ని 9,000 సార్లు తిర్పాలి. ఇలా ఒక చీర తయారీకి అవసరమైన 'ఆసు' పోయాలంటే ఒక స్త్రీ అయిదు గంటలు కష్టపడితే కాని తయారు కాదు. దీంతో భుజాల్లో నొప్పితూ పాటు కళ్ళకు ఎక్కువ కష్టం కలుగుతుంది. తన తల్లి పడుతున్న బాధను విముక్తి కలిగించాలన్న తలంపుతో ఈ సమస్యకు పరిష్కారం కనుగొన్నాడు చింతకింది మల్లేశం. ఇతను కనిపెట్టిన 'లక్ష్మీ ఆసు మిషన్' సునాయాసంగా రోజుకు ఐదారు చీరలకు ఆసు పోసి ఇవ్వగలదు. ఎవ్వరూ ఆ మిషన్ దగ్గర ఉండాల్సిన అవసరం లేదు. కేవలం స్టార్ట్ చేసేసి తన పని తాను చూసుకోవచ్చు. పోచంపల్లి చేనేత రంగంలో ఇంతటి విప్లవానికి కారణమైన ఈ ఆసుమిషన్ తయారు చేయడం ద్వారా మల్లేశం చేనేతకారులు మరో అడుగు ముందుకు వేసేలా చేశాడు. అంతే కాక, ఆర్థికంగా కూడా ఎదిగేలా చేశాడు. ఈ ఆసు మిషన్‌కు ఎన్.ఐ.ఎఫ్. 5వ ద్వైవార్షిక పోటీల్లో ప్రథమ బహుమతి వచ్చింది. ఆ బహుమతిని భారత రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభా పాటిల్ చేతులమీదుగా అందుకున్నాడు. ఇతడు మన రాష్ట్రానికి చెందిన వాడు కావడం అదీ హైదరాబాద్‌కు అతి సమీపంలో గల ఆలేరు సమీప గ్రామవాసి కావడం ఎంతో ముదావహం. ఇతని స్ఫూర్తితో ఇంకా ఎన్నో పరికరాలను మన గ్రామీణ ఇన్నోవేటర్లు కనుగొని రాష్ట్ర కీర్తిని విశ్వ వ్యాపితం చేస్తారని ఆశిద్దాం.

మల్లేశం ఆసు మిషన్ గురించి ఇంకా పూర్తి వివరాలు తెలుసుకోవాలంటే "జనవరి – మార్చి 2008, సంపుటి 2, సంచిక 3 'పల్లెసృజన' చదవండి".

**ఉల్లినాటు వేసే యంత్రము (2వ జాతీయ బహుమతి) :**

మహారాష్ట్రకు చెందిన పండరినాథ్ సర్జేరావ్ మోరె (66 సం.) వ్యవసాయ పనిముట్లు, వ్యవసాయ యంత్రాలు, విద్యుత్ పరికరాలు, ఉద్యాన వనాలలో తక్కువ ఖర్చుతో వ్యవసాయం, నీటిని పొదుపుగా వినియోగించే విధానం లాంటి ఎన్నో కనుగొన్నాడు. ఉల్లినాటు వేయడం ఖర్చుతో, ఎక్కువ కూలీలతో కూడుకున్నదే కాక ఎంతో కష్టమైన పని కూడా. పండరినాథ్ దీనికై ఒక కొత్త పరికరానికి రూపకల్పన చేశాడు. ఉల్లినాటు సరియైన పద్ధతిలో సరియైన క్రమంలో నాటే విధంగా ఒక యంత్రాన్ని రూపొందించాడు. ఇది ట్రాక్టరుతో నడిచే సెమీ ఆటోమేటిక్ యంత్రం. ఇది ఒకేసారి మూడు పనులు చేయగలదు. ఉల్లి నాటడంతో పాటు ఎరువును వేయటం, నీరు పారేందుకు కుదుర్లను కూడా తయారు చేస్తుంది. పండరినాథ్ తన పరిశోధనను ఎవరైనా తయారు చేసుకుని వాడుకోవచ్చని ప్రకటించాడు. భగవంతుడు నాకీ తెలివిని ఇచ్చాడు. నేను దీన్ని తయారు చేశాను. అందరూ ఇలా




తయారు చేసుకుని విరివిగా వినియోగిస్తే అదే పదివేలు. **భగవంతుడు సృష్టించిన ఎన్నింటికో పేటెంట్ హక్కులు లేనప్పుడు నాకు మాత్రం ఎందుకు అంటాడు పండరినాథ్.**

**360డిగ్రీలు తిరిగే ట్రాక్టరు (3వ జాతీయ బహుమతి) :**



గుజరాత్‌కు చెందిన బచ్చుభాయ్ తేసియా (57 సం., హైస్కూలు విద్య) ఎలక్ట్రానిక్ వస్తువులను రిపేరు చేయగల రైతు. దాదాపు 25 కొత్త తరహా వస్తువులను రూపొందించాడు. అందులో చెప్పుకోదగ్గది 360 డిగ్రీలు తిరిగే ట్రాక్టరు. సాధారణంగా ట్రాక్టరు వెనక్కి తిరగడానికి కొంచెం ఎక్కువ స్థలం కావలసి వస్తుంది. కానీ ఈ ట్రాక్టరు చాలా తక్కువ ప్రదేశంలోనే వెనక్కే కాదు, 360 డిగ్రీలు కూడా తిరుగ గలదు. ఈ ట్రాక్టరులో ఏర్పాటు చేసిన బెల్టును వదులుగా, బిగుతుగా చేయడం ద్వారా ఇది సాధ్యపడుతుంది. ఈయన మనం సాధారణంగా వాడుకునే బల్బులో చిన్న సర్క్యూట్‌ను చేర్చి విద్యుత్తులో



హెచ్చుతగ్గులను తట్టుకుని ఎక్కువ కాలం మన్నేలా తయారు చేశాడు. విచిత్రమేమిటంటే ఈ బల్బు లోపలివైపు యజమాని సంతకం కూడా పెట్టుకోవచ్చు!. బచ్చుభాయ్ తుప్పును వదలకొట్టడానికి మూలికలతో రసాయనాన్ని

తయారు చేశాడు. దీని సహాయంతో తుప్పు పట్టి బిగిసిపోయిన నట్లు, బోల్టులను సులభంగా తీయవచ్చు.

**వేరుశనగ పంటపై చీడ నివారణకు మూలికలతో సస్యరక్షణ (2వ జాతీయ అవార్డు) :**



గుజరాత్‌కు చెందిన నాథుభాయ్ పటేల్ (65, హైస్కూలు విద్య) తన 2.6 హెక్టార్ల పొలంలో వేరుశనగ, ప్రత్తి, కందులు, ఆవాలు, ఆముదము, జొన్న వంటి పంటలను వేసేవాడు. కానీ ఈ పంటలకి పురుగులు వట్టి చాలా నష్టం జరిగేది. దీనికి విరుగుడుగా నాథుభాయ్ ప్రత్యేకించి వేరుశనగ పంట రక్షణ కోసం ఒక మూలికల మందు కనిపెట్టాడు. దీనికై స్థానికంగా దొరికే ఒక ఆయుర్వేద మొక్కకు చెందిన పండులో వేపాకులు కలిపి ద్రావకం తయారు చేశాడు. దీనిని చెట్టు మొదల్లో స్ప్రే చేశాడు. ఫలితాలు చాలా బాగున్నాయి. దీనిని అహమ్మదాబాద్ లోని సద్భావ్, సృష్టి, సంశోధన ప్రయోగ శాలల్లో ఇతర క్రిములపై ప్రయోగించి చూడగా క్రిములని నియంత్రించడంలో బాగా పని చేస్తుందని నిర్ధారించారు.

**కరెంటు షాక్‌ను నిరోధించే యంత్రం (3వ జాతీయ స్థాయి అవార్డు) :**



మణిపూర్‌కు చెందిన క్షేత్రిమయూం నికల్సన్ సింగ్ (23, హైస్కూల్ పాస్) కి ఎలక్ట్రానిక్ వస్తువులను రిపేరు చేసే షాపు ఉండేది. తనకే కాక ఓ నలుగు రికి ఉపాధి కల్పించేవాడు. ఇతను కరెంటు షాక్ కొట్టకుండా నిరోధించే పరికరాన్ని కనిపెట్టాడు ఇది గృహాలకి, వాణిజ్య దుకాణాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీనిని కరెంటు




మీటర్ ప్రక్కన అమర్చి కరెంటు లైన్లన్నీ దీనితో అనుసంధానం చేస్తారు. ఫలితంగా ఇంట్లో ఎక్కడా కరెంటు కరెంటు షాక్ అన్న మాటే ఉండదు. ఇతను ట్యూబ్‌లైట్ చౌక్ ఎక్కువ కాలం మన్నేలా ఒక పద్ధతి కూడా కనుగొన్నాడు. అలాగే ఎక్కడికైనా తీసుకు వెళ్ళగలిగే సౌరశక్తి ప్యానల్‌ను కూడా రూపొందించాడు.

**ఆటోమేటిక్‌గా ఎల్.పి.జి. గ్యాస్ ఆపేసే పరికరం (జాయింట్-1 జాతీయ అవార్డు) :**



కర్నాటకకు చెందిన దావల్సాబ్ మహమ్మద్ గౌస్ (18, హైయ్యర్ సెకండరీ సైన్స్ విద్యార్థి) వంట అయిపోగానే గ్యాసు తనంతట తానే ఆగిపోయే పరికరం కనిపెట్టాడు. వంటకు ఎంత సమయం పడుతుందో ముందుగా నిర్ణయించుకొని టైం ఫిక్స్ చేసి పెడితే వంట పూర్తి కాగానే గ్యాసు అదే ఆగిపోతుంది. దీనివలన గ్యాసు వృధా కావటం, వంటలు మాడిపోవటం, గ్యాసువల్ల జరిగే



ప్రమాదాలను కూడా నివారించవచ్చు. పెద్ద పెద్ద గ్యాస్ కంపెనీలు చేయలేని పనిని ఈ యువకుడు సాధించాడు. తయారీదారులు ఎవరైనా ముందుకు వస్తే ఈ పరికరాన్ని మార్కెటింగ్ చేయడానికి వేచియున్నాడు.

**కుక్కర్‌తో కాఫీ తయారు చేయడం (3వ జాతీయ అవార్డు) :**

బీహార్‌కు చెందిన మహమ్మద్ రోజాద్దీన్ (46, నిరక్షరాస్యుడు) టైర్ల రిపేరు షాపులో పనిచేస్తూ సాధారణ కుక్కర్ సహాయంతో నీటిని మరిగించి, కుక్కర్ విజిల్ ద్వారా వచ్చే ఆవిరిని పైపు ద్వారా సేకరించి వేడి నురగలతో కూడిన కాఫీని తయారు చేసి



చూపించాడు. ఈ పరికరం చుట్టుపక్కల అనేక జిల్లాల్లో చాలామందికి ఆర్థికంగా ఎంతో మేలు చేసింది. టీ దుకాణదారులకు ఇది ఎంతో ఉపయోగకరం.

# 'పచ్చై మలై' కొండజాతి అనుసరించే సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులు



''మళయాలీలు'' అనే ఈ కొండజాతికి చెందినవారు తమిళనాడు, తిరుచ్చి జిల్లాలోని 'పచ్చైమలై" కొండలలో నివసిస్తారు. సముద్ర మట్టానికి సుమారు 2,500 నుండి 3,000 అడుగుల ఎత్తులోని కొండలలో వారు ప్రధానంగా వ్యవసాయం చేసేవారు. వారు వర్షాధార పంటలైన రాగి, సమై, వరగై, పైనాపిల్ మొదలగునవి పండించేవారు. గత 20 సంవత్సరాలుగా వారు సగ్గుబియ్యం లాంటి ఒకరకమైన బియ్యాన్ని పండిస్తున్నారు. ఉద్యానవన పంటలైన మామిడి, పనస, అరటికి తోడుగా జీడిమామిడి కూడా సాగు చేసేవారు. 2009 మే, 22-25 తేదీల మధ్య పచ్చైమలై కొండలలో నిర్వహించిన శోధయాత్రలో భాగంగా 'సేవా' సభ్యులు నమోదు చేసిన వారు అనుసరించే సాంప్రదాయక విధానాలు ఈ క్రింద పొందు పరచడమైనది.

## విత్తన నిల్వలో మెలకువలు :

కంది మొదలగు పప్పుదినుసుల విత్తన తయారీలో పంట చేతికి వచ్చిన తరువాత విత్తనాలను బాగా ఎండబెడతారు. తరువాత ఆ విత్తనాలకు జిగురుగా తయారు చేసిన ఒక రకమైన చెదలు మట్టితో పైపూత వేసి (విత్తన శుద్ధి చేసి) ఎండబెట్టి నిల్వ ఉంచుతారు. దీని మూలంగా నిల్వ ఉంచడం వల్ల వచ్చే ఒకరకమైన క్రిముల నుండి కాపాడటం జరుగుతుంది.

కొన్ని గ్రామాలలో ఆముదము, పసుపు కలిపిన మిశ్రమంతో విత్తన శుద్ధి చేసి ఎండబెట్టి నిల్వ ఉంచుతారు. ఈ రకంగా చేయడం వలన ఎలాంటి కీటకాలకు గురి కాకుండా సుమారు సంవత్సరం పాటు నిల్వ ఉంచవచ్చు. ఇప్పటికీ కొంతమంది రైతులు ఈ విత్తనాలను నిల్వ ఉంచడానికి మరొక పద్ధతి అవలంభిస్తారు. బాగా ఎండిన విత్తనాలను నిల్వ ఉంచే ప్రాంతంలో మూడు భాగాలు నింపుతారు. మిగిలిన పావు భాగం తులసి మొక్కలతో నింపుతారు. ఈ విధంగా ప్రతినెల పౌర్ణమినాడు ఈ విత్తనాలను పాత్రనుండి బయటికి తీసి పగలు పూర్తిగా ఎండబెడతారు. అలాగే రాత్రి కూడా గాలికి ఆరబెడతారు. ఇలా శుద్ధి చేసి నిల్వ ఉంచిన విత్తనాలను జులై - ఆగస్టు మాసాలలో వచ్చే పౌర్ణమి రోజున విత్తుతారు.

## క్రొత్త కుండతో వర్షం రాకను పసి గట్టుట :

ఎప్పుడైనా ఎక్కువ కాలం వేడిగా వుండి వర్షాభావం ఏర్పడ్డప్పుడు ఈ కొండజాతి గిరిజనులు పాత కాలంలో రాబోయే కొద్ది రోజులలో వర్షం వస్తుందా, రాదా అనేది కొత్త కుండ విధానం ద్వారా ఊహించేవారు.

ఈ విధంగా వర్షం రాకను ఊహించి చెప్పే వ్యక్తి ఉపవాసం ఉండి, స్నానం చేసి తడి బట్టలు ధరిస్తాడు. ఇంటిలో ఒక ప్రక్క ఆవుపేడతో అలికి నోచి చెట్టు కొమ్మలతో శుభ్రం చేస్తారు. ఈ నేలపై సుమారు 4 మానివలు వడ్లు పోస్తారు. ఈ ధాన్యంపై ఒక క్రొత్త కు,డను ఉంచి దాని నిండుగ పరిశుభ్రమైన నీటిని నింపుతారు. ఇప్పుడు ఉపవాసం ఉన్న వ్యక్తి ఆ కుండపై కూర్చొని చేతులను క్రింద నేలపై ఉంచుతారు. తరువాత ధాన్యాన్ని ఒక్కొక్క గింజగా ఆ కుండలో వేస్తారు. కుండ తిరగడం మొదలు పెడితే వర్షం అదేరోజు వస్తుందని సూచన. అలా కుండా తిరగనట్లయితే, ఒక్కసారిగా రెండు లేదా మూడు ధాన్యపు గింజలను కుండలో వేయాలి. ఒకవేళ 3 గింజలు వేసినపుడు కుండ తిరగడం మొదలు పెడితే సుమారు 3 రోజులలో వర్షం రావచ్చు అనేదానికి ఇది సూచన.

ఈ విషయాన్ని బూతక్కల్ గ్రామానికి చెందిన శ్రీ కరుప్పణ్ణన్ తెలియజేశారు.

## వర్షాలను ఆహ్వానించడం :

ఆ గ్రామంలోని మహిళలు అందరు ప్రతి ఇంటినుండి గంజిని సేకరించి, అన్నింటిని కలిపి కలిపి సహపంక్తి భోజనానికి సిద్ధం చేస్తారు. ఈ విధంగా చేస్తే వర్షాలు త్వరగా కురుస్తాయని నమ్ముతారు.

## సహకార (ఉమ్మడి) భూములలో 'విరలి' తోటల పెంపకం :

పండుగలు, పబ్బాలు మరియు వివాహాల సమయంలో వెదులు బొంగులు పాతి దానిపై విరలి ఆకులతో పందిరి వేస్తారు. ప్రతి గ్రామంలో ఉమ్మడి భూములలో ఈ విరలి తోటలు పెంచుతారు. వెదురు



బొంగులపై వెలుగులు విరజిమ్ముతూ ఆభరణాలను పోలినట్లుగా అలంకరణ చేస్తారు.

**ఒకేపంట ఉత్పత్తి తగ్గదలకు కారణమవుతోంది :**

రాగి, సమై, ఎత్తుగా ఎదిగే చెట్లతోట, కందులు మొదలగు పంటల స్థానే ఈ రోజులలో భూసారాన్ని, భూముల రకాలను చూడకుండా గత 20 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం సగ్గుబియ్యం లాంటి ఒక రకమైన బియ్యాన్ని పండిస్తున్నారు. ఇది భూసారాన్ని తగ్గించి, ఉత్పత్తి తగ్గడానికి కారణమవుతోంది. ఎకరానికి 60–70 బస్తాల నుండి దిగుబడి 50 బస్తాలకు తగ్గి పోయింది. దిగుబడి పెరగలేదు.

**పొలం గట్లపై పశుగ్రాసంగా ఉపయోగించే ఒక విధమైన గడ్డి పెంపకం :**

గత రెండు సంవత్సరాలుగా ఈ 'టాపియోకా' పండించే పొలంగట్లపై వర్షాధార పంటగా ఈ క్రొత్తరకం పశుగ్రాసాన్ని పండిస్తున్నారు. దీనిమూలంగా కొండ ప్రాంతాలలో వర్షానికి వాలు భూముల పై మట్టి కొట్టుకపోకుండా గట్లు పటిష్టంగా ఉండేందుకు దోహదపడుతోంది.

**వాపులకు మూలికా వైద్య చికిత్స :**

క్రింద పడటం మూలంగా మనుషులలోగాని, పశువులలోగాని వాపులు వచ్చినట్లయితే, ఇక్కడి అటవీ ప్రాంతంలో ప్రకృతి సహజంగా పెరిగే 'కరుప్పాలై' అనే ఒకవిధమైన చెట్టు నుండి తయారు చేసిన మూలిక లేపనాన్ని పూసినట్లయితే వాపులు తగ్గిపోతాయి. ఈ 'కరుప్పాలై' చెట్టు చర్మాన్ని ఒలిచి, బాగా పొడిచేసి నీటితో ఉడికించి పేస్టు (లేవనం) లాగా తయారు చేసి ఉపయోగించాలి. 'కరుప్పాలై' చాలా కఠినమైన కొయ్యగా ఉండి, ఎలాంటి చెద పురుగులకు అవకాశం ఇవ్వదు.

**పశువులు, గొర్రెలు, మేకలు ఎక్కువగా ఇష్టపడే మేత ఆకులు :**

పశువులు ఎక్కువగా ఇష్టపడే ఈ క్రింది రకాల గడ్డి మొక్కలు అడవులలో ఎక్కువగా పెరుగుతాయి.

1. అనైసుతి, 2. థెరియా, 3. చెల్లా ఫోలిజ్, 4. విలుతిలన్ ఫోలియేజ్, 5. జాక్ ఫ్రిఫోలియేజ్ (పనస చెట్టు ఆకులు), 6. శాండిల్‌వుడ్ ఫోలియేజ్ (గంధపు చెట్టు ఆకులు), 7. ఎలుంబి ఫోలియేజ్, 8. వాగై ఫోలియేజ్, 9. కురుంతు ఫోలియేజ్, 10. మయిలాడి ఫోలియజ్, 11. మగిలిట్రి ఫోలియేజ్, 12. విదాతలన్ ఫోలియేజ్, 13. వేమనన్ వైన్.

**పశువులలో కళ్ళు ఎరుపెక్కుట :**

ఏదేని కూచిగా ఉన్న వస్తువు మనుషులలో గాని, పెంపుడు జంతువులలో గాని, పశువులలోగాని కళ్ళలో గుచ్చుకున్నప్పుడు 'అనంతలై' చెట్టు ఆకులు నీటిలో ఉడికించాలి. వేడి ఆకులను ఒక నేత గుడ్డలో కట్టి దెబ్బ తగిలిన కంటిపై కాపడం పెట్టాలి.

**క్రిములు కుట్టడం ద్వారా ఏర్పడ్డ మరియు చీము ఏర్పడ్డ పుండు :**

ఒక విధమైన క్రిములు కుట్టడం ద్వారా ఏర్పడ్డ పుండును ఎట్టి చెట్టు పట్టతో తయారు చేసిన పొడిని కలిపిన నీటితో కడగవలెను. అలాగే చీము పట్టిన పుండ్లను స్టెరిలైజ్ చేసిన కాటన్ గుడ్డతో బాగా శుభ్రం చేసి 'విరలి' చెట్టు ఆకులు నూరి తయారు చేసిన పేస్టును పూసి గుడ్డతో కట్టు కట్టవలెను.

**ఆవు ఎదకు రాకపోవు స్థితికి :**

అక్కడి జాతివారికి లేగ ఆవులు చూలుకు రానట్లయితే చూలు వచ్చేందుకు 'కన్నెమరి' దేవతకు మొక్కుకొని పొంగలి చేసి మొక్కు తీర్చుకోవడం ఆచారం. లేగ ఈనినట్లయితే మొదటి ముర్రుపాలు ఆ దేవతకు అర్పించుకుంటారు.

**ఆంబోతును గుడికి దేవుని పేరున వదిలివేయటం :**

దేవతలు కలలో కన్పించి, కొన్ని ప్రత్యేక లక్షణాలున్న ఆవు మగదూడ (ఎద్దు) మీ ఇంట జన్మిస్తుంది అని చెబితే అలాంటి లక్షణాలున్న దూడ జన్మించినట్లయితే దానిని దేవుడి గుడి పేరున వదిలివేయడం, దానిని



ఆబోతుగా వ్యవహరించడం ఇప్పటికీ కొన్ని మళయాళీ కుటుంబాలలో అనాదిగా వస్తున్న ఆచారం. ఇది కేవలం పునరుత్పత్తి మాత్రమే ఉపయోగింప బడుతుంది. ఎలాంటి వ్యవసాయ పనులకు ఈ ఆబోతును ఉపయోగించరు.

వృద్ధాప్యం వచ్చి ఈ ఆబోతు మరణించినట్లయితే దానిపై ఒక కొత్త తెల్లని వస్త్రం కప్పి ఆచార ప్రకారం దహనం చేస్తారు. 14 రోజుల తరువాత 14వ రోజు క్రతువు నిర్వహించి, ఆ క్రతువుకు హాజరైన వారందరికి భోజనాలు పెడతారు.

**ఒక్కపొద్దుకు ముగింపుగా సాంప్రదాయ ఆహార వంటకం :**

తమిళ మాసం 'పురత్తసి' నెలలో ప్రతి శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఒక్కపొద్దు ఉండి ఒకేసారి రాత్రి భోజనం తీసుకుంటారు. ఈనెలరోజులు మాంసం ముట్టరు. మిలకరణై ఆకులు, లేత నిమ్మ ఆకులు, మొరింగ ఆకులు, ఎల్లిగడ్డ, ధనియాలు కలిపి నువ్వుల నూనెలో ఉడికించి, ఆ చమురును ఒక సీసాలో నిల్వ ఉంచుకొని, అన్నం, పప్పులో ఈ చమురు కొద్దిగా కలుపుకొని రుచికరమైన ఆహారంగా తీసుకుంటారు.

**ఎట్టి (ముషిడి చెట్టు) ఉపయోగించి కంపోస్టు తయారి :** ముషిడి చెట్టునుండి సేకరించిన పచ్చి, ఎండు ఆకులను పైరు నాట్లప్పుడు పచ్చి ఎరువుగా ఉపయోగిస్తారు. 6 అడుగుల లోతు గొయ్యి తీసి దానిలో ముషిడి చెట్టు ఆకులు, లాంటానా చెట్టు ఆకులు, పొంగమియా చెట్టు ఆకులు, ఆవుపేడను పొరలు పొలుగా వేసి 6-10 నెలల పాటు కంపోస్టు ఎరువుగా తయారు కావడానికి ఉంచుతారు. వర్షాధార పంటలలో ముందు ఎండు నేలపై ఈ ఎరువును వేస్తారు. ఈ ఎరువు మూలంగానే బియ్యం రుచికరంగా ఉంటాయి అనేది వారి నమ్మకం.

**అరటి మరియు మామిడి పంటలకు :**

అరటి గెలలను వంటకు వచ్చినపుడు కోసి గెల కాడ చివర కాల్షియం హైడ్రాక్సైడ్ (లైమ్) పేస్ట్‌ను పూస్తారు. ఒక పెద్ద పాత్రలో 'పన్నన్' చెట్టు ఆకులను కుప్పగా పోసి దానిపై ఈ అరటి గెలలలోను ఉంచుతారు. దీనివలన 4 రోజులలోనే అరటి గెలలు ఎండుతాయి. కొందరు 'పలాధలై' ఆకులు కూడా వాడతారు.

**పరిశోధకులు :** పెరుంపరుప్పుకు చెందిన శ్రీయుతులు కృష్ణన్ చోళయతికి చెందిన రామస్వామి, కుందకాడుకు చెందిన ఎమ్. పెరుమాల్, మేల్‌చిగురు పట్టికి చెందిన ఆర్. శేఖర్, తర్కల్ మరియు రామర్ (అలియాస్ అయ్యకూ పుత్తూరుకు చెందిన ఎ. అరప్పీశనం. సేకరణ, సంగ్రహణ : పి. వివేకానందన్, ఎస్.ఇ.వి.ఎ., మధురై - 10.

## గ్రామీణ సృజనాత్మక శక్తి వేదిక 'పల్లెసృజన'

పల్లెసృజన ఒక వేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది. మీ సమస్యలను "పల్లెసృజన"లో ప్రచురిస్తాం. వాటి సమాధానాలు పాఠకులు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మీరంతా సహకరించి ఈ గ్రామీణ సృజనాశక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం.

-సంపాదకవర్గం



# మనుష్యుల నేస్తాలు - పక్షులు

- యస్. అశోక్ కుమార్,
ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్)
మెంబర్, ఆం.ప్ర. వైల్డ్ లైఫ్ అడ్వైజరీ బోర్డ్ &
కో-ఆప్టెడ్ మెంబర్, ఎ.పి. బయోడైవర్సిటీ బోర్డ్.

సామాన్యంగా మీరు ప్రతిరోజూ ఏదో ఒక పక్షిని చూస్తూ వుంటారు. కాని ఈ పక్షులు మన జీవితములో ఏవిధంగా తోడ్పడుతాయని ఎప్పుడైనా ఆలోచించారా! లేదు, ఎందువల్ల అంటే దినచర్యలో నిమగ్నమై వ్యవధి లేక, లేదా ఆసక్తి లేక లేదా అవగాహనా రాహిత్యం వల్ల గాని, మనము వాటిని గురించి పట్టించుకోము. మానవ లోకానికి పక్షులు ఎవ్విధముగా తోడ్పడుతున్నా యని తెలుసుకుంటే, వాటిమీద శ్రద్ధ, ఆసక్తి కలిగి వాటి సంరక్షణ కోసము మీరు ముందంజ వేసి పూర్తి సహకారాన్ని అందజేస్తారు.

ఆకర్షణీయమైన రంగు రంగుల ఈకలు, వివిధ రూపాలు, పలు కంఠస్వరాలు, ప్రణయ రాగాలు, కలిగి గగన తలములో స్వేచ్ఛగా విహరించే పక్షులు వెలలేని ఆభరణాలు. పలు వర్ణాల చిలుక పలుకులు, కోయిల కమ్మని పాటలు, సింగాల కరవే (బల్బార్ విజిలింగ్ థ్రష్) మరియు టొంక నాలంచి (ఇండియన్ షామ) పక్షులు ఇంపైన ధ్వని తరంగాలు, ఎర్ర లిలించి (రూఫస్ బ్యాక్డ్ ష్రైక్), టింక పసల పోలిగాడు (రాక్ టెయిల్డ్ డ్రోంగో) కొండ మైనాలు ధ్వన్యానుకరణ, పులకరించే మయూరి నాట్యాలు, మానవ లోకానికి ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.



ముఖ్యంగా పక్షులు రైతులకు నేస్తాలు. పచ్చని మొక్కలు, చెట్లపై ఆధారపడే చీడ పురుగులు, కీటకాలు దండులు దండులుగా ఉత్పత్తి అయి పంటలను పళ్ళ తోటలను కారడవులలోని పచ్చదనాన్ని విధ్వంసం చేస్తాయి. మనదేశంలో ఇలాంటి కీటకాలు జాతులు 30 వేలకు పైగా ఉంటాయి! అమెరికాలో కొలరాడో కీటకము (బంగాళాదుంప నల్లి) అదుపు లేకున్న ఒక్క ఋతుకాలంలో 60 మిలియన్ల జనాభా అందగలుగుతుంది. దక్షిణాఫ్రికాలో 1335 హెక్టార్ల పచ్చని క్షేత్రములో 14 టన్నుల మిడుతల దండ్లు ఉత్పత్తి అయి పంటలను క్షణకాలంలో పూర్తిగా నాశనం చేసి ఉండేవి. ఇవ్విధముగా ప్రకృతిలో క్రిమి, కీటకాల



జనాభా అతి త్వరితగతిని పెరుగుతుంది. పక్షులు లేని పక్షంలో ప్రపంచం తారుమారై ఎడారిగా మారవచ్చు. ఇందువల్ల క్రిమి కీటకాల జనాభా అదుపులో పెట్టడానికి పక్షులకు కీలకపాత్ర ఉన్నది.

మనదేశంలో 2060 ఉపజాతులలో 85 శాతం పక్షులకు, పురుగులు, కీటకాలు ప్రధాన ఆహారం. ఉదాహరణకు బట్టమేక పక్షి (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్) మెట్ట పైర్లలోని చీడ పీడలను, మిడుతలను తిని రైతులకు ఎంతో మేలు చేస్తాయి. వానకోవెల (స్పారో) బాబులు పిట్ట (స్విఫ్ట్) ఎగురుతూ ఉండే కీటకాలను తింటాయి. వడ్రంగి పిట్ట (ఫుడ్ పెకర్) చెట్ల మొదళ్ళలో కొమ్మలో ఉండే రంధ్రాలలో దాగివున్న క్రిములను వెలికి తీసి తింటాయి. పిచ్చుకలు ఒక రోజులో 240 నుండి 320 మార్లు చీడ పురుగులను తమ పిల్లలకు



అందజేస్తాయి. ఒక చిన్న పిట్ట అరగంటలోపల 600 గొంగళి పురుగులను మరొక పిట్ట దాదాపు 3 వేల మొక్క పేలను అదే కాలములో తిన్నట్లు పక్షి శాస్త్రజ్ఞులు గమనించడం జరిగింది. టిట్ అనే పక్షి జంట, వాటి సంతతి ఒక ఏడాదిలో నూట ఇరవై మిలియన్ల కీటకపు గుడ్లను లేదా 1,50,000 పురుగులను ఆహారంగా తీసుకుంటాయని జర్మనీ దేశ శాస్త్రవేత్త అంచనా వేసినారు. విదేశాలనుండి వచ్చే పలు జాతుల వలస పక్షులు, అనేక రకాల స్థానిక నీటి పక్షులు, క్రిమి కీటకాదులను చిన్న చేపలను తింటూ వాటి రెట్టలతో భూములను జలాశయ సమీపంలోని పంటలను పచ్చదనాన్ని సారవంతం చేస్తాయి.

డేగలు (హాక్స్), భైరవిడేగలు (ఫాల్కన్స్), గ్రద్దలు, గుడ్లగూబ లాంటి వాటాడే పక్షులు మన పంటలను పాడుచేసే చుంచులను, ఎలుకలను, పంది కొక్కులను ఉడుతలను వేటాడి రైతులకు ఎంతో సహాయం చేస్తాయి. పాములు, ఇతర జీవులు పక్షుల గుడ్లను, పిల్లలను తింటాయి. వీటిని, వేటాడే పక్షులు చంపి ఇతర పక్షులను కాపాడుతాయి. క్రిములకు స్థావరాలుగాను, వాహనాలుగాను ఉపయోగపడే కీటకాలను సంహరించి మానవాళిలో తీవ్రమైన వ్యాధులను అరికట్టడంలో దోహదము చేస్తున్నాయి.

బోరువలు (వల్చెర్స్), గ్రద్దలు, కాకులు, జంతువుల మృత కళేబరాలను కుళ్ళిపోతున్న చెత్త, చెదారాన్ని తొలగించి గ్రామ పరిసరాలను శుభ్రం చేస్తాయి. కరువులు, వరద కాలములో చెల్లా చెదురుగా పడివున్న మృత కళేబరాలను తిని మన పర్యావరణానికి పరిరక్షణ కల్పిస్తాయి.

కొన్ని పక్షులకు పువ్వులలోని మకరందం ముఖ్య ఆహారం. దీనికి అనుకూలంగా వాటి ముక్కులు, నాలుకలు రూపొంది ఉంటాయి. మకరంద సేకరణలో ఈ పక్షులు పువ్వు, పువ్వును సందర్శించినప్పుడు పుప్పొడిలో కొంత పక్షి





తలకు, ముక్కుకు, ఈకలకు అంటుతుంది. ఇవ్విధముగా పుప్పొడిని మరొక పుష్పానికి అందజేసి పరపరాగ సంపర్కానికి తోడ్పడుతాయి.

పరజ, తోకపరజ, వల్లంబట్టు, పెద్ద చిలవ, తెడ్డుముక్కు బాతు, పుంజములుగు, కునింగాయ మరియు ఇతర కొల్లేటి పిట్టలు, కౌజులు, కోలంకి పిట్టలు (క్వీల్స్), జంబుకోళ్ళు (మూర్‌హెన్), తీతువ పిట్టలు, పావురాళ్ళు, బెల్లగువ్వలు మొదలగు పక్షులను వేటాడి తింటారు. చైనాలో నీటికాకుల సహాయంతో మత్స్యకారులు చేపలను వేటాడుతారు.

పై విధముగా మనకు ఎంతో తోడ్పడే పక్షులకు సంరక్షణ కల్పించడం మన బాధ్యత, ప్రధాన కర్తవ్యము. ఎందువల్ల అంటే పక్షులు మన దేశ ప్రజల జీవావరణ సంపద.



# జీవన విధానంలో మార్పు రావాలి!



- పూసర్ల జనార్ధన రావ్,
అరసాడ,
విజయనగరం జిల్లా.

ఒక క్రొత్త శాస్త్రీయమైన మతం. ప్రపంచంలో ప్రతి పనికి మూలం, సర్వ మతాల సారం "నమ్మకం". ఈ మతంలో ప్రజల మధ్య నమ్మకాన్ని అభివృద్ధి చేయడం ప్రధాన ఉద్దేశ్యం. ఈ మతంలో శాస్త్రీయమైన ఆరోగ్య నియమాలు, సాంఘిక సంబంధాలు మెరుగుపరుచు విధానాలు, వైద్యం, విద్య, ప్రపంచ వీక్షణం, ఉచిత భోజనం ఉంటాయి. ప్రతి ఒక్కరు కనీసం ఒక సంవత్సరం పాటు ఈ మతం ద్వారా ప్రపంచ సేవ చేయాలి. ప్రతి భక్తుడు ఇలా చేస్తే భక్తుడుగా గుర్తించబడును. మతం ద్వారా వచ్చు సదుపాయాలకు అర్హుడు. 7 సంవత్సరాల సేవ చేస్తే గ్రీన్ ఇంక్ హోదా, 14 సంవత్సరాలు చేస్తే రాష్ట్ర వీక్షణ, 21 సంవత్సరాలు చేస్తే దేశ వీక్షణ, 35 సంవత్సరాలు చేస్తే ప్రపంచ వీక్షణ, 49 సంవత్సరాలు చేస్తే విశ్వ వీక్షణ భాగ్యం అందించబడును. ఈ మతంలో మోక్ష సాధన అనగా విశ్వ వీక్షణ కలగడం ఎంత ఎక్కువ సేవ చేస్తే అన్ని ప్రాంతాలు చూడవచ్చు.

**పూజా విధానం :** రంజాన్ రోజులనుండి ఈ మత భక్తుడుగా దీక్ష పూనాలి. ఆకుపచ్చని దుస్తులు ధరించాలి. ప్రతి పని (కార్యం)లో నవ్వు ముఖం కలిగి ఉండాలి. ప్రతి క్షణం నవ్వును ముఖంపై వుంచడం దేవుడిపై దృష్టి వుంచినట్లుగా పరిగణించాలి.

విశ్వ సృష్టికి మూలం – పదార్థం. గురుత్వాకర్షణ శక్తి, బిగ్ బ్యాంగ్ థియరీ, హైబ్రిడ్ టెక్నాలజీ, శక్తి నిత్యత్వ నియమం, ప్రధానంగా ఆక్సిజన్ మూలం. కావున ఆక్సిజన్ ఆటమ్‌ను దేవునికి మూలంగా తీసుకోవడం కర్తవ్యం. ఒక సెకను ఆక్సిజన్ లేనిదే జీవించలేము. భూమివలె ఒక ఇనుప గోళాన్ని మేగ్నెట్ పవర్ ద్వారా గాలిలో తేలినట్లు ఉంచుట దీనికి గుర్తు. లేదా విగ్రహం. ఇటువంటి సైంటిఫిక్ టెక్నిక్స్‌తో ఒక దేవాలయాన్ని నిర్మించాలి. ప్రతి సాధారణ భక్తుడికి కూడా నిజంగా సైన్సే దైవం అన్న భావన కలిగించాలి.

**మహా మంత్రం :** "ఓ విశ్వశక్తి స్వరూపా! నాపై నాకు నమ్మకం, నాపై ఇతరులకు నమ్మకం ఉండే విధంగా నా ప్రవర్తనా విధానాన్ని ఉన్నతంగా, ఉత్తమంగా, ఉత్సాహంగా ప్రజామనీషిగా ప్రజ్వలింపుము'' అని స్మరించాలి.

**శ్లోకాలు :** ఓం ఎడిసనే నమః – బల్బుం సమర్పయామి

ఓం గెలిలియో నమః – టెలిస్కోపు సమర్పయామి.

ఓం బైర్డే నమః – టెలివిజన్ సమర్పయామి

ఓం పెన్సిలినే నమః – టీకా మందు సమర్పయామి

ఓం రైట్ బ్రదర్సే నమః – విమానం సమర్పయామి

సైన్సు ఇంతగా అభివృద్ధికి కారణం అయిన శాస్త్రవేత్తల గౌరవార్థం వారిని ఈ విధంగా స్మరించడం మన కర్తవ్యం.

**కథా విధానం :** సృష్టికి మూలం, సృష్టి క్రమం, జీవం ఏర్పాటు, సైన్సు గొప్పతనం, ప్రపంచంలో వింతలు, విశ్వ వీక్షణ దృశ్య రూపం మున్నగునవి ప్లానిటోరియం ద్వారా విశ్వ విక్షణ, ఆధునిక యంత్రాల ఉపయోగం.

**సైంటిఫిక్ మతంలో సాంప్రదాయాలు :**

**1.** అక్కడ పిల్లలనుగాని, అన్న పిల్లలనుగాని మేనత్త మేన మామ పిల్లలనుగాని వివాహం చేసుకోరాదు. మేనరికం వలన తెలివైన ఆరోగ్యవంతమైన పిల్లలు పుట్టుట అరుదు అని సైన్సు తెలుపుతోంది.

**2.** దక్షిణలు, డొనేషన్స్ తీసుకొనబడదు. డబ్బులను డిపాజిట్ చేసుకోవచ్చు. ఒకరోజు నుండి 100 సంవత్సరాల వరకు ఒక రూపాయి నుండి కోట్ల రూపాయల వరకు. వడ్డీ ఉండదు. ఈ డిపాజిట్‌ల పెట్టుబడి ద్వారా వచ్చే లాభాలను వివిధ సేవలకు, ఉపయోగించడం జరుగుతుంది. ఒక ఎల్.ఐ.సి., యస్.బి.ఐ., ఆర్.బి.ఐ.ల విధులు కలిపి నిర్వర్తించుట జరుగును.

**3.** ఆహారంను పండించే వ్యవసాయదారునికి బ్రాహ్మణుడికి గౌరవం ఇచ్చినట్లు ఒక ప్రత్యేక విధానం ద్వారా ప్రతి రైతుకు గౌరవం అందించటం. ఎంతో శ్రమతో మనకు అతి ముఖ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారు కావున.

**4.** వివాహం, శుభకార్యాలు, రిజిస్ట్రేషన్‌తో కూడిన క్రొత్త పూజా విధానం, వారి శ్రేయస్సుకు సర్వకాలాలు ఈ మతం చూస్తుంది. శాస్త్రీయమైన విధానాలు ఉంటాయి.

**5.** భూమిమీద పుట్టిన ప్రతి మానవుడు పదవులను బాధ్యతలను చేపట్టవచ్చు. నమ్మకంగా వుండాలి. లాటరీ ద్వారా ఎన్నుకోవడం, రాజరిక వ్యవస్థలోగాని,

ప్రజా ప్రభుత్వంలోగాని, సామాన్యుడికి చోటు దక్కలేదు. ఇదీ అన్ని పార్టీలవలె ప్రపంచ స్థాయిలో అన్ని ప్రాంతాలలో పాల్గొంటుంది. నమ్మకమే మూలం, తెలివి, శక్తికి డబ్బుకి మనం అంతా వున్నాం. ఉదాహరణకు ఒక నియోజకవర్గంలో అన్ని పార్టీ వ్యక్తులతో ఈ పార్టీ కోడ్ పోటీ చేస్తుంది. కోడ్ గెలిస్తే ఆ నియోజకవర్గంలో ఒక వ్యక్తిని లాటరీ ద్వారా ఎన్నుకొంటాం. ఆయనే మన ఎమ్మెల్యేగా స్వీకరించుతాం. ఒక పేదవాడికి కూడా ఎమ్మెల్యే అవకాశం వస్తుంది. 6 నెలలు ట్రైనింగ్ ఇవ్వబడుతుంది. ఈ మతం ప్రభుత్వం వలె పెద్ద స్థాయిలో సేవలందించినట్లు.

**6.** 2012 యుగాంతం అంటున్నారు. వాస్తవం లేకున్నా వారిలో భయం పారద్రోలుటకు జనవరి 1, 2012 ఉదయం 12-01 నిమిషానికి కొత్త సైంటిఫిక్ యుగం ప్రారంభించాలి. దీని సేవలపై ప్రపంచ ప్రజలకు అవగాహనకు ఆధునిక సైన్సు ఉపయోగపడాలి. ప్రాథమికంగా విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు కృషి చేయాలి. ప్రజలను మూఢనమ్మకాల నుండి విముక్తి చేయాలి.

**7.** న్యాయ వ్యవస్థ, పోలీసు వ్యవస్థ, వైద్య వ్యవస్థలో ముఖ్యమైన అంశాలను సైంటిఫిక్ సేవా భక్తుల ద్వారా ప్రజలకు అందజేయాలి.

**8.** ఈ మతంలో భక్తులు ఒక సంవత్సరం అనుభవం తరువాత సైంటిఫిక్ భక్తుడుగా గుర్తింపు పొందుతాడు. అప్పటినుండి ఈ మతం ఆ భక్తులు ప్రతి చర్యలో రక్షణ తీసుకుంటుంది.

**9.** ఇది ఒక నెట్‌వర్క్ వలె పనిచేస్తుంది. ఒక భక్తుడు ఇద్దరు భక్తులుగా వారిచే కనీసం ఒక సంవత్సరం సేవ చేయించాలి. వారు ఒక్కొక్కరు ఇద్దరు చొప్పున భక్తులను చేర్చాలి. ఇలా ఒక్కొక్కరు తమ ప్రాంతాలను చక్కగా అభివృద్ధి చేసుకోవచ్చు. ఆ మతం ఉచిత భోజనం కల్పిస్తుంది. సలహాలు, సూచనలు ప్రతి ఒక్కరికి అందజేస్తుంది. ప్రపంచ స్థాయిలో శాస్త్రీయంగా, ప్రభుత్వం వలె సేవలందిస్తుంది. ఇతర మతాలలో దేవుడు మంచి కలిగిస్తాడని నమ్ముతాం కాని, సాక్ష్యాలు లేవు. కాని, ఈ మతంలో ప్రతి భక్తుడు (ప్రజలందరు) శ్రేయస్సుకి ప్రత్యక్షం, సాక్ష్యాధారాలతో రక్షణ కల్పిస్తూ ఉన్నతికి కృషి చేస్తుంది.

**10.** ప్రతి భక్తుడికి రిజిష్టర్ నెంబర్ వుంటుంది. అదే ఫోన్ నెంబర్ వలె కూడా పని చేస్తుంది. తన సమస్యలను మతానికి పంపిస్తే తక్షణం ప్రతిస్పందిస్తుంది.

**11.** ప్రతి భక్తుడు "ఒక కల"ను తన మదిలో ఏర్పరచుకొని దాని సాధనకొరకై కృషి చేయాలి. ఈ మతం వారి కలను (మంచివి) నెరవేర్చుటకు కృషి చేస్తుంది. భూమిమీద మానవుడుగా పుట్టిన తరువాత ఎక్కువ మందికి మనం ఉపయోగపడాలి. కోర్కెలు కలిగి వుండాలి. క్రమంలో సాధిస్తూండాలి. ఈ జన్మను సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి సెకను నవ్వుతూ (కృత్రిమంగా అయినాసరే సహజంగా అలవాటు అయినంత వరకు) వుండాలి. నవ్వుపై దృష్టి పెట్టడమే దేవునిపై దృష్టి పెట్టడం.

**12.** రూ. 100 ఆదాయంలో 30 ప్రాంతస్థాయికి, 20 జిల్లా స్థాయికి, 20 రాష్ట్ర స్థాయికి, 20 దేశ స్థాయికి, 10 ప్రపంచ స్థాయికి ఖర్చు చేయాలి.

**13.** ముఖ్యంగా ప్రతి ఒక్కరు తన తదనంతరం తన శరీరాన్ని ఈ మతానికి అర్పితం చేయాలి. ఈ మతం ఇతరులకు ఉపయోగపడు భాగాలు అందజేస్తుంది. రక్తదానం ఉన్నతం.

**14.** సినిమాల ద్వారా గాని, టెలివిజన్ ద్వారా గాని, పేపరు ద్వారాగాని ప్రజలకు ఈ మత ప్రదాన ఉద్దేశ్యాలు అందజేయడం, శాస్త్రవేత్తలను పూజించడం, సైన్సు గొప్పతనం చాటుట, శాస్త్రీయమైన భావనలు ప్రజలకు అందజేయడం మనందరి కర్తవ్యం. ప్రతి మనిషి ప్రజామనిషిగా ప్రజ్వలించాలి.

**15.** ఇంకా శాస్త్రీయం అయిన ఆలోచనలను చేర్చుకుంటూ పోవాలి.

●

**వివరాలకు :** పూసర్ల జగన్నాథం, అరసడ గ్రామం & పోస్ట్, బలిజిపేట మండలం, విజయనగరం జిల్లా. - 535 557. సెల్ : 94417 57670.

**ఈ వ్యాసాన్ని వినూత్న ఆలోచనగా స్పందించి పాఠకులకు అందిస్తున్నాం. ఈ భావాలు కేవలం రచయితవి మాత్రమే - ఎడిటర్.**

●


# ఫోన్ చేయండి!

## 'పల్లెసృజన'లో

ప్రచురించిన వ్యాసాలను గూర్చి ఏవైనా వివరాలు కావలసిన వారు, గ్రామీణ ఇన్నోవేషన్లకు సంబంధించిన ఇతర సమాచారం కోసం ఈ క్రింది చిరునామాకు ఉత్తరం వ్రాసి కాని, లేదా క్రింద తెలిపిన నెంబర్లకు ఫోన్ చేసి కాని తెలుసుకోవచ్చు. లేదా ఈ-మెయిల్ ద్వారా కూడా మీకు కావలసిన సమాచారాన్ని పొందవచ్చు.
- ఎడిటర్.

**బ్రిగేడియర్ పి. గణేశం**
**ఎడిటర్‌పల్లెసృజన**
**102, వాయుపురి,**
**సైనిక్‌పురి పోస్ట్,**
**సికింద్రాబాద్ - 500 094.**
**ఫోన్ : 040-27118555**
**సెల్ : 98660 01678**
E-mail : honeybeeap@gmail.com

# గ్రామీణ సృజనాత్మకతను పట్టించుకోని సమాజం



ఒక గ్రామంలో ఒక శిల్పి నివసిస్తూ ఉండేవాడు. అతను నైపుణ్యానికి, కళకు పెట్టింది పేరు. కాని అతని తండ్రి అతనిని ఎప్పుడూ ప్రోత్సహించడం కాని, అతని కళాత్మకను ప్రశంసించడం కాని, అతని కళను గూర్చి ఒక్క మెచ్చుకోలు పలుకు పలకడం గాని, అతనిని కనీసం లెక్క చేయడం కాని చేసేవాడు కాదు. కాని కొడుకు మాత్రం ఎప్పటికైనా తండ్రి అభిమానాన్ని చూరగొనాలని, దృష్టి తనవైపు మరల్చాలని, తనపట్ల, తన కళపట్ల శ్రద్ధ చూపేలా చేయాలని ప్రయత్నించేవాడు.

కొడుకు ఒకరోజు మధ్యాహ్నం తమ ఇంటి ప్రాంగణంలోనగ భూమిలోపల ఏదో వెతుకుతూ, క్షణం తీరికలేని వానిగా త్రవ్వసాగాడు. చికాకు కల్గించే విధంగా కొడుకు చేస్తున్న చర్యపట్ల తండ్రి దృష్టి కేంద్రీకరించవలసి వచ్చింది. కొడుకును తిడుతూ నీవు ఏం చేస్తున్నావు? అని ప్రశ్నించాడు. దానికి కొడుకు సమాధానం ఇస్తూ "నేనొక అద్భుతమైన వస్తువును చూశాను. దానికోసం త్రవ్వుతున్నాను" అన్నాడు. దాంతో తండ్రిలోని శిల్పికి కూడా ఒకింత ఆత్రం కలిగింది. తండ్రికూడా ఆ గొయ్యి త్రవ్వడంలో కొడుకుకు సహకరించసాగాడు. చివరకు ఎట్టకేలకు వారిద్దరు ఒక చక్కని నాట్య భంగిమలో ఉన్న ఒక స్త్రీమూర్తి శిల్పాన్ని వెలికి తీయగలిగారు.

ఆ శిల్ప సౌందర్యానికి ముగ్దుడైన తండ్రి ఇలా అంటాడు. "కుమారా! నిజమైన కళ అంటే ఇది అంటాడు" ఆ శిల్పాన్ని చూపిస్తూ. ఇంకా ఈ శిల్పం చాల అద్భుతంగా, సౌందర్యవంతంగా ఉంది అంటాడు. అలాగే ఈ అద్భుత కళాఖండం సృష్టించడం వెనుక ఏ మహాశిల్పి హస్తం అందో కదా అని అబ్బురపడతాడు. దానికి కొడుకు ఒకింత విషాదంగా నవ్వుతూ "ధన్యవాదాలు నాన్నగారూ, ఈరోజుకు నా జీవితాన్ని సార్థకం చేశారు" అంటాడు. నాట్య భంగిమలో ఉన్న స్త్రీమూర్తి విగ్రహాన్ని రాతితో చెక్కి భూస్థాపితం చేసిన ఆ శిల్పి కుమారుడు ప్రతిరోజూ అనేకమంది చిన్నారులు పరిశోధిస్తున్న అనేక విషయాల వెనుకనున్న నిజాన్ని తెలుసుకున్నాడు.

**తల్లిదండ్రులుగాని, అధ్యాపకులు గాని వివిధ సారస్వత విషయాల పట్ల చిన్నారులు చూపిస్తున్న ఆసక్తిని గుర్తించడం లేదు. అలాంటి వారిని అభినందించడం లేదు. మేము చర్చించిన పిల్లలకు తమ పట్ల పెద్దల ప్రవర్తన సమ్మిళితంగా ఉంది. కొందరు పెద్దలు అనవసరంగా విమర్శ చేస్తారు. కొందరు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఎంతగానో సపోర్ట్ చేస్తారు. కాని చాలామంది విమర్శ చేస్తారు. మానసిక శక్తిని, శక్తి సామర్థ్యాలను పెంపొందించుకునే అవకాశం లేని పిల్లలు సమజాభివృద్ధికి తోడ్పడ గలరా? సాంస్కృతిక వైవిద్యాన్ని గుర్తించగలరా? విజయాన్ని నిర్ణయించే మానాలు ఏకోన్ముఖంగా ఉండిపోవాలా? పిల్లలను ప్రోత్సహించే పెద్దల గురించిన ప్రేరేపిక నిజమైన కథలను పాఠకులనుండి మేం ఎదురు చూస్తున్నాం. మనం మాట్లాడుకునే పిల్లలలో చాలామంది సమ్మిళితమైన అనుభవం కలవారు. కొందరు తల్లిదండ్రులు, అధ్యాపకులు చాలావరకు ఇలాంటి వాటిని పెంచి పోషించేవారే కాని, చాలామంది దీనికి విరుద్ధం. వివిధ రంగాలలో తగిన అవకాశాలు లేక పిల్లలు వృద్ధిలోనికి రాలేకపోతున్నారు. వారు అవకాశం వస్తే సాంస్కృతికంగా బహుళార్థక సంఘ పురోభివృద్ధికి తోడ్పడ గలరా? వారి జీవితంలో విజయావకాశాలను ఏకోన్ముఖం చేయదానికి కొలమానాలు లేవా? పిల్లలు చవిచూసిన ప్రేరణాత్మక కథలలోను పెద్దలు ప్రోత్సహించే మంచి రోజులకోసం ఎదురు చూద్దాం.**

ఉప్పు భూముల్లో శోధయాత్ర

# ఉప్పు పాటలు - ఉప్పు పనివారితో అడుగులు



మన ఆహారంలోకి ఉప్పును అందిస్తున్న తమ జీవితాలను పణంగా పెడుతున్నా బాగా వెనుకబడిన ఒక తాండవాసులను 'కచ్' ఎడారిలో నడుస్తూ సాగిన శోధయాత్రలో కలిసి మళ్ళీ ఒకసారి పల్లె ప్రజల విజ్ఞాన సంపదను గుర్తించాము. మే 11, 2009న 'నబ్రాజ్' బెట్ నుండి మొదలైన ఉప్పు శోదయాత్ర మే 14, 2009న 'ఖారగొడ' తో ముగిసింది. క్రూర గాడిదల రక్షిత ప్రదేశమునకు అడ్డంగా దాటినపుడు అగరియాలకు, క్రూగాడిదలకు మధ్య వైరము లేదని మేము కనుగొన్నాము.

ఇజ్రా 4:14 "ఇప్పుడు మేము సంస్థానము ఉప్పు తింటున్న కారణంగా రాజుగారి అమర్యాదకు సాక్షులమగుటకు మాకు సరియైనది కాదు. అందుచేత దీనిని మేము రాజుకు పంపి తెలియజేస్తాము" అందుచేత ఎవరి ఉప్పు తింటామో వారిని మోసగించరాదనే సామెత వచ్చింది. పురాతన రోమన్ సైన్యములో సైన్యానికి జీతములో కొంత భాగమునకు ఉప్పు రూపంలో ఇచ్చేవారు. సాలారియమ్ అనే పదం నుండి సాలరీ అనే పదం పుట్టింది. సలారియమ్ అనగా ఉప్పు అని అర్థము. ఎవరి ఉప్పు మనం తింటామో వారిపై విశ్వాసంగా ఉండటంపై గొప్ప ప్రాముఖ్యాన్నివ్వడం మన సంస్కృతిలో కూడా ఉంది. కచ్ ఎడారిలో ఉప్పు పనివాళ్ళచే తయారు చేయబడిన ఉప్పును ప్రతిరోజు వినియోగించు కుంటున్నప్పటికీ వారిని దేశం ఏమాత్రం పట్టించుకోవటం లేదు. దీంతో కదలిపోయిన హనిబీ నెట్‌వర్క్ కచ్ ఎడారిలో మే 2009న బయలుదేరారు. మళ్ళీ ఎంతో ఆశతో అన్వేషణ. ఉప్పు పనివాళ్ళ జీవితాలలో క్రొత్త పరిశోధనలకై అన్వేషణ. ఎండిపోయిన ఉప్పులో దాగున్న సృజనలకై అన్వేషణ. ఇంకా అగరియాలలో పేర్చబడిన సాంప్రదాయ జ ా ఞ న వ ం ం నకై అన్వేషణ. వచ్రాజ్ బెట్ నుండి ఖర్గోడ





వరకు సాగే ఈ చిన్న శోధయాత్రకు గంటార్ అనే న్యూ గాంధియన్ సంస్థ సహకారముంది. మొదటి బస పటాడిలో ఉన్న వారి హెడ్ క్వార్టర్స్‌లోనే జరిగింది. గంటార్ సంస్థ నిర్మాత మరియు కో–ఆర్డినేటర్ అయిన సుఖ్‌దేవ్ భాయిగారు అగరియాలు ఎదుర్కొన్న కష్టాలు మరియు నవాళ్ళను గురించే మాట్లాడటమే కాకుండా, గిజుభాయి బాల్ అకాడమీ యొక్క ఉద్దేశ్యాలను, కార్యక్రమాలను పంచుకొన్నారు. ఈ అకాడమీ ఉప్పు పనివాళ్ళ మరియు సమాజంలో ఇతర వెనుకబడిన వర్గాల వారి పిల్లలకు చదువు చెప్పుటకు స్థాపించబడినది. మూడు సంవత్సరాలకు పూర్వం కేవలం బాలికలనే చేర్చుకొనేవారు. ఏ సామాజిక సమస్యనైనా నివారించేందుకు వారు ఒక సృజనాత్మకమైన బాధలను గుర్తించి తెలియజేసే పద్ధతిని అభివృద్ధి చేశారు. ఒక ఫిర్యాదుల పెట్టెను ఒక విశిష్టమైన స్థానంలో ఉంచారు. ప్రతివారం ఆ పెట్టె తాళం చెవిని మరొక విద్యార్థికి ఇస్తారు. పెట్టెనుంచి తీసిన అన్ని లేఖలను, ఫిర్యాదులను, సలహాలను అందరూ సమావేశమయినపుడుఉన్నది ఉన్నట్టుగా బయటికి చదువుతారు. చర్య తీసుకొంటారు. అవసరమైన చోట వివరణ ఇస్తారు. తర్వాత ఈ యంత్రాంగమంతా అవసరం లేకుండా పోయింది. అన్యోన్య విశ్వాసము మర్యాదలను పెంచుకోవడం ద్వారా సమస్యలు లేకుండా పోయాయి.

వద్రాజ్ బెట్‌కు పోయే మార్గములో, ఉప్పు పనివాళ్ళ పిల్లల బడి (రణశాల)ని చూడటానికి చాముండవాఢి వద్ద శోధ యాత్రికులు ఆగారు. ఇంతకుముందు ఉప్పు తయారు చేసే సమయాలలో కుటుంబీకులు వలస వెళతారు. ఆ సమయాలలో పిల్లలు మానేసేవారు. కానీ గంటార్, ప్రభుత్వంతో ఒక పద్ధతిని ఏర్పాటు చేసింది. ఉప్పు తయారు చేసే సమయాలలో పిల్లలు రణశాలలో వారి చదువు సాగిస్తారు. వారు వాళ్ళ ఊళ్ళకు వెళ్ళినపుడు వాళ్ళ హాజరు కూడా లెక్కలోకి వస్తుంది. బడికి రెండుమూడు కి.మీ. దూరంలో అక్కడక్కడ ఉన్న గుడిసెలలోని పిల్లలకు ఉపాధ్యాయుడు బడికి వచ్చిన విషయాన్ని తెలియజేయుటకు ఒక ఉత్సాహకరమైన మార్గాన్ని ఉపయోగించేవాడు. అతడు ఒక అద్దం తీసుకొని గుడిసెలవైపుగా చూపుతాడు. విద్యార్థులు ఉపాధ్యాయుడు బడికి వచ్చాడని తెలుసుకుంటారు. శ్రీ పవన్‌సింఘ్ అనే ఒక చిన్న తరహా ఉప్పు రైతు తక్కువ ధరకు వచ్చే గాలిమిల్లును అభివృద్ధి చేసిన దాని గురించి చాలా ఇష్టంతో మాట్లాడడాడు. ఇది మెహతార్ హుస్సేన్ మరియు ముస్తాక్ హుస్సేన్ అనే అస్సామ్ వాస్తవ్యుల ద్వారా అభివృద్ధి పరచబడి "గ్యాన్‌వెస్ట్" సంస్థ ద్వారా మెరుగు దిద్దబడింది.

సాయంత్రము వద్రాజ్ బెట్ వద్ద ఒక ఉత్సాహకరమైన చర్చ జరిగింది. అయొడైజ్డ్ ఉప్పు విధానము వల్ల ఈ ప్రాంతము ఎందుకు అప్పుల పాలయింది, దోపిడీకి గురైంది. ఉప్పు ఉత్పత్తి మరియు వాణిజ్యం వ్యాపారవేత్తలు స్వాధీనం చేసుకునేలా ఎలా దారితీసింది. సార్వత్రిక ఉప్పు అయొడైజేషన్ పై రాజకీయాలను మళ్ళీ లెక్కించవలసి యున్నది. (సాంప్రదాయక ఉప్పు తింటున్న అగరియాలలో ఒక్కరికి కూడా అయోడిన్ తక్కువైనట్లుగా గుర్తింపబడలేదు వైద్యశాలల్లో ఒక్క కేసు కూడా రిజిష్టర్ కాలేదు.





గుడిసెల పైకప్పులలో కంతుల వద్ద పావురాళ్ళు మరియు పిచ్చుకల కొరకు ప్రత్యేకమైన గూళ్ళు నిర్మించబడ్డాయి. చుట్టూ ఏ చెట్లూ లేనందువల్ల ఈ పక్షులకు గూళ్ళు కట్టుకోవటానికి స్థలము లేదు. అందుచేత వాళ్ళు వాటికొరకు గూళ్ళు ఏర్పరిచారు. ఆహారం కూడా అందించారు. అగరియాలు నీటి కొరకు బావులు త్రవ్వేటపుడు ప్రాణ రక్షణ కొరకు పావురాలపై ఆధారపడతారు. అత్యధికమైన వేడికి బావుల అడుగు భాగములో పావురాళ్ళు నివాసము ఏర్పరచుకొంటాయి. కార్బన్ మోనాక్సైడ్ విడుదలయినపుడు టాక్సిన్ గాస్‌కు వెంటనే స్పందించే పక్షులు వెనువెంటనే ఎగిరి వెళ్ళిపోతాయి. ఇది చాలా విలువైన కొన్ని నిమిషాల సమయాన్ని ఇచ్చి అగరియాలను హెచ్చరిస్తాయి. వారు వెంటనే బావులను వదలి బయటికి వచ్చేస్తారు. సందర్భాను సారంగా, 2003లో అమెరికా సైన్యము భయానకమైన ఇరాక్ యుద్ధంలో చాలా భయంకరమైన టాక్సిన్ గ్యాస్‌ను తెలుసుకొనుటకు పావురాళ్ళను ఉపయోగించుకున్నారు.

జిలాదన్ బెట్ మార్గంలో, సాధారణంగా మహుడి (నూయెడా మారిటిమా (ఎల్.) డ్యూమార్ట్) అని పిలవబడే ఒక ప్రాంతతీయ మొక్క గుర్తించబడింది. ఉప్పు పనివాళ్ళు మరియు పాత్రా అనే ప్రాంతీయవాసులు దానిని తిన్నారు. ఈ యొక్క రుచి పుల్లగా ఉంటుంది. ఈ ప్రాంతమంతటా ఈ మొక్క అందుబాటులో ఉంటుంది. హెర్బల్ సాల్ట్ తయారు చేసే సృష్టి ల్యాబ్స్ నుండే శాంపిల్స్ తీసుకుని పరీక్షించుటకు పంపబడ్డాయి. అప్పుడప్పుడు క్రూర గాడిదలు (హెమియోనస్ ఖుర్) కనిపించాయి. అగరియా లు వీటిని చంపేటట్లయితే ఎందుకు వారి నివాసాల వద్దకు వస్తుంటాయి అని ఆ ప్రాంత తెగలు మళ్ళీ మళ్ళీ అడిగారు. ఇదే విధంగా మాల్‌ధారీల నుండి కూడా గిర్ శాంగ్చురీలో మొదటి శోధయాత్రలో వినియున్నాము.

దురదృష్ట వశాత్తు కలుపు మొక్క గందా బావల్ (ప్రోసోపిస్ జులిఫ్లోరా – యస్.డబ్ల్యు. డి.సి.) ఈ ప్రాంత పుష్ప జీవ వైవిధ్యాన్ని మొత్తాన్ని ఊడ్చేసింది. జింజువాడ పోయే మార్గములో చారిత్రాత్మకమైన ఒక చెరువును చూశాము. ఇప్పుడు ఇది ఎండిపోయింది. క్రీ.శ. 10 నుండి 13వ శతాబ్దాలలో కీర్తివరులైన శోలంకి పరిపాలకులకు ముఖ్య పట్టణమే ఈ జింజువాడ గ్రామము రాజేశ్వరి దేవాలయము పరిసరాలలో ఆరోజు రాత్రి జరిగిన సమావేశములో వంటకాల పోటీలో విజేత శ్రీమతి ప్రఫుల్లాబెన్ కానూభాయ్ సోనిని సత్కరించాము. చాలా మోటార్స్‌ను ఒకే స్టార్టర్ ద్వారా పనిచేయించే స్విచ్‌ను అమర్చిన యువ సృజనకారుడు రవిభాయ్ గజ్జర్‌ను గౌరవించారు. సి.ఎస్.ఎమ్.సి.ఆర్.ఐ., భావ్‌నగర్ శాస్త్రజ్ఞులు నీళ్ళను శుభ్రం చేయుటకు తీసుకువచ్చిన సంచార శాస్త్రీయ వ్యాన్ ద్వారా శుభ్రము చేసే విధానాన్ని వివిధ సాంకేతిక విజ్ఞానాలను వివరించి చూపారు.

తర్వాత రోజు ఉదయం వాగ్వాడ వైపు శోధయాత్రికులు కదిలారు. 5000




సంవత్సరాల పాత గ్రామము. హరప్పకు ముందు నాగరితకు చెందినదిగా నమ్ముతారు. ఇక్కడ విచారకర దృశ్యమేమిటంటే వందల సంవత్సరాల పూర్వపు నాటి పాత వావ్ (మంచినీటి దిగుడు బావి) ఇప్పటికి కూడా ఈ బావిలోని నీటినే మంచినీటిగా ఉపయోగి స్తున్నారు. చుట్టుపక్క గ్రామాలలో ఇలాంటి ఏడు బావులను పూర్వపు పాలకులు నిర్మించారు. (ఒక ఆసక్తికరమైన జానపద కథతో సంబంధముంది). ఇవన్నీ దాదాపు అన్నీ శిథిలావస్థలో ఉన్నాయి. వీటిని పునరుద్ధరించి ఒక ఆకర్షణీయమైన యాత్రా స్థలంగా మార్చగలిగితే అది అద్భుతమే. మార్గ మధ్యంలో ఆ ప్రాంతమువారు ఆపి అచటి అరుదైన మొక్కను చూపి పరిశీలించమన్నారు. దాని పేరు రోగత్ రోహిదా (టెకొమేల ఉండులత డి.డాన్) వివిధ ప్రాంతాల జనులు ఈ మొక్క ఆకుల కోసం వస్తుంటారు. ముందు ఆ గ్రామ ప్రజలకు దీని ఉపయోగాలు తెలియవు. ఈ చెట్టుకోసమే వేరే వాళ్ళు ఆ ఊరికి వచ్చిపోవడం చూసి వీరిలో కూడా ఉత్సాహం పెరిగింది. 15 అడుగుల వెడల్పు 10 అడుగుల ఎత్తుగల గట్లను ఒక పెద్ద కంపెనీ నిర్మించింది. ఇది ఎవరైనా చూడవచ్చు. ఆ కంపెనీకి హిందూస్థాన్ సాల్ట్‌వర్క్ రాయితీలతో కౌలుకిచ్చింది. ఉప్పు పనివాళ్ళ మంచినీళ్ళ కొరకు భూమిలోపల వేసే గొట్టాల విషయంలో అడ్డంకులు పెడుతున్న వారిని ఈ విషయం ఆకర్షించటం లేదు. బయటికి చెప్పే కారణం క్రూర గాడిదలకు ఈ పొడవైన గట్లే ఇబ్బందులని వాస్తవం కాదేమో.

మిథగోడులో శాస్త్రయ ఉప్పును తయారు చేయడంలో వారి అనుభవాన్ని సి.ఎస్.ఎమ్.సి.ఆర్.వి. బృందం వారు వివరించారు. సమావేశ స్థలానికి పక్కనే పనితనంలో వ్యత్యాసం చూపుతున్న ఒక సందర్భము చూడగలము. సిమెంట్ అతుకులతో ఇటుకల గోడ వర్షము వల్ల శిథిలమై ఉంది. పలకలతో బయటికి పేర్చుతూ కట్టిన గోడ ఇంకా గట్టిగా ఉంది. శోధ యాత్రికులు భారతదేశంలో ఇంతకుముందెన్నడూ ఎక్కడా చూడని ఒక ఉత్సాహకరమైన సృజన ఇది. మట్టిలో చెక్కుగా పలకలను పేర్చిన విధానమునకు కలుభాయ్ రంచోడ్భామ్ ప్రజాపతి అనే కుమ్మరి నైపుణ్యమే సాక్ష్యం. సి.ఎస్.సి.ఎమ్. ఆర్.ఐ., భావ్‌నగర్‌కు చెందిన శాస్త్రజ్ఞులు డా. భట్ గారు గ్రామ సమావేశములో ఉపన్యసించారు. ఆ ఉపన్యాసములో "సముద్ర బిట్టర్న్" యొక్క ఉపయోగాన్ని వివరిస్తూ ఉప్పు ఉత్పత్తిలో ఆదాయాన్నందించే మరొక వనరుగా పేర్కొన్నారు. మంచి ఉప్పు ఉత్పత్తిని పెంచుటలో అగరియాలకు సహాయం చేయుటకు ఈ సంస్థ ఒప్పుకుంది. రెండు గ్రామ ఉపాధ్యాయులకు గ్రామ జ్ఞాన రిజిస్టర్ ఇవ్వడమైనది. మార్గమధ్యములో దారిపక్కన అంతరించిపోతున్న భారత నక్షత్ర జాతికి చెందిన తాబేలును యాత్రీకులు చూశారు.

**మెరుస్తున్న పాత్రలు, వేదన పూరిత ప్రతిబింబాలు :**

పాత్రలేకనుక చాలా అధికంగా మెరుస్తుంటే ఇంటి ఇల్లాలు ఒత్తిడికి లోనైనట్లే. పెద్దవారు దీనిని గమనించి ఆ కుటుంబానికి సలహాలివ్వవలెను. మెరుస్తున్న పాత్రలు స్త్రీల జీవితాలలోని ఒత్తిడికి ఎందుకుముడిపడి ఉంటాయి? దీనిని బట్టి ఏమనిపిస్తుందంటే ఒక స్త్రీ ఒత్తిడికి లోనయ్యి, ఆ సమస్యకు పరిష్కారం దొరకకపోతే పాత్రలను శుభ్రం చేసేటపుడు తన కోపాన్ని వాటిపై చూపిస్తుంది. ఆమె ఎంత ఎక్కువ నిరాశకు లోనైతే అంత బాగా మెరిసేటట్లుగా పాత్రలను తోముతుంది. ఆ ప్రకాశమే అప్పుడు ఆమె భావనను సూచిస్తుంది. ఒక చిన్న గుడిసెలో ఒకవైపు ఈదర గాలులు వీస్తుంటే, అందులోనే పక్షులు కూడా నివసిస్తుంటే మరోపక్క రకరకాల పనిముట్లు కూడా ఉంటే ఆ గుడిసెలోనే జీవితం సాగించడం అంత సులభం కాదు. ఉప్పును తయారు చేస్తూ ఆవేదనకు లోనై దేవేంద్రబాయి ఒక బాధాపూరిత పద్యము వ్రాశారు. ఇచ్చట యాత్రీకులు మరొక వింతైన విషయాన్ని గమనించారు. చాలామంది ముసలి వాళ్ళు చదువుకున్న వాళ్ళు. వారికి మనవళ్ళు మాత్రం చదువు లేనివారు.


వంద సంవత్సరాల వయస్సుగల హర్భ భాయి మక్వానా ఆశీస్సులు మరియు విజ్ఞానము. హెర్బల్ చికిత్సకులు. సృజనకారుల ఉత్సాహము, మతాతీత సాంప్రదాయాన్ని సార్థకం చేయుచున్న అంబు భాయి పటేల్ (ఈ ప్రాంతము మరియు జనుల సామాన్య చరిత్రకారుదు. ఇతను ఒక ఫొటో గ్రాఫర్. ఉప్పు పనివాళ్ళ జీవితాలపై ఒక సంచార ప్రదర్శనశాలను అభివృద్ధి చేశాడు) ఇంకా మొదలగువారి శాంతియుత సహజీవనము శోధ యాత్రికుల ను అద్వితీయంగా ఆకర్షించాయి. భద్ర పరచడం ద్వారా సృజన పరిమితం అవుతుందా? ఈ చిన్న శోధయాత్ర ఖార్గోడుతో ముగిసినప్పటికీ హనీబీ నెట్‌వర్క్ అన్వేషణ కొనసాగింది.



# నూరేళ్ళ అపురూప సహచర్యం
# జివిబెన్ - హర్భ భాయి మక్వానా

హర్భ భాయి మరియు జీవిబెన్‌లు కలిసి చాలాదుర్భరమైన జీవితాన్ని ఎదుర్కొన్నారు. తమ కష్టమైన కల ప్రవాహాన్ని వారు ఏ విధంగా ఈదినది, ఆ జ్ఞాపకాలను ప్రేమగా దాచుకొన్నారు. 'ఘసైమైతో ఉజ్జా దైమే' అని ప్రముఖ దక్షిణ గుజరాత్ గాంధేయవాది శ్రీ రవిశంకర్ మహరాజ్ గారు జీవితం గురించి చెప్పిన తత్వాన్ని వీరిరువులు తమ జీవితంలో వ్యక్తీకరించారు. (బాగా తోమడం వల్ల లోహం ఎలాగైతే గొప్పగా ప్రకాశిస్తుందో అలాగే కష్టాలు పడ్డప్పుడే ఉన్నతమైన స్థాయికి మనిషి చేరతాడు). ఖర్గోడ ఉప్పు భూములలో వారి గ్రామము రెండు కుటుంబాలు ఉన్నప్పటి నుండి అభివృద్ధి చెందడం నూటమూడు సంవత్సరాల జీవిబెన్ హర్భ భాయి చూసింది. పాట్‌డి కి సమీపంలో నవరంగ్ పురా అనే గ్రామంలో ఆమె పుట్టింది. వీరు ముగ్గురు అక్కా చెల్లెళ్ళు, ముగ్గురు అన్నదమ్ములు. కానీ ఈమె మాత్రం అంత ఎక్కువ సంవత్సరాలు జీవించింది. ఆమె భర్త హర్భభాయికి నూట మూడు సంవత్సరాలు. అతను మంచి చమత్కారి. వారి పేర్లను అడగగానే అతను వెంటనే 'ఆమె బెహర్భా" అని బదులిచ్చాడు. అంటే ఇద్దరమూ ఒకటే అని. 12-13 సంవత్సరాల వయసులో వారి పెళ్ళి జరిగింది.

హర్భ భాయి తండ్రి ప్రత్తితో బొంతలు, దుప్పట్లు తయారు చేసి అమ్మేవారు. ఆయన తన అన్నదమ్ములతో, అక్క చెల్లెళ్ళతో చాలాకాలంగా ఆడిన ఆటలు, పొట్లాటలకు సంబంధించిన ప్రియమైన జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకొన్నాడు. వారు గేవి, దాదా వంటి ఆటలు ఆడుకునేవారు. మరొక ఆటలో చక్రాన్ని కర్రతో కొడుతూ, వెంబడిస్తూ ఆడుకునేవారు.



**జీవితంలో పరీక్షా సమయం :**

వారికి ఆరుగురు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులు. పెద్దకొడుకు ఆటలమ్మ పోసి చనిపోయాడు. అతని పెళ్ళి నిశ్చయమై, పెళ్ళి పనులు చేస్తుండగా అలా జరిగిందని చెపుతూ ఆమె కంట తడి పెట్టుకుంది. మనవడు కావాలని వీరి అత్తా మామలు తనను చిత్రహింసలు పెట్టిన రోజులను ఒకసారి గుర్తుకు తెచ్చుకుంది. కొడుకు చనిపోయిన తర్వాత ఆరుగురు కూతుళ్ళు పుట్టడం వల్ల రాత్రింబవళ్ళు తను కష్టపడి పనిచేసేదని చెప్పింది. ఎవరూ నాకు ఇంటిపనిలో సహాయం చేసేవాళ్ళు కాదు. అత్తగారి అనుమతితోనే నేను తినాలి. మా నాన్న, అన్నదమ్ములు చిన్న వయసులోనే చనిపోవటం తో నేనెక్కడికి వెళ్ళలేక పోయాను. ఎప్పుడైనా ఆయన నావైపు మాట్లాడితే మా మామయ్య ఆయనని కొట్టేవారు. ఆమె అవస్థ చూసి నాకెంతో బాధ కలిగేది. కాని నాన్నకు ఎదురు తిరిగి మాట్లాడలేక పోయేవాణ్ణి అని హర్భ భాయి చెప్పాడు. వారికి ఏడవ బిడ్డ పుట్టిన తరువాత వాళ్ళు తమకంటూ ఒక సొంత మార్గాన్నే ఎన్నుకొన్నారు. వాస్తవానికి ఏ ఆసరా లేకుండా ఇంటినుంచి బయటికి వచ్చేశారు. వారు ఒక చిన్న గుడిసె వేసుకొని నివసించ సాగారు. అప్పుడు నేను కట్టుకున్న ఒక చీర మాత్రమే ఉండేది. ఆ చీరను కొంత నేలమీద పరిచి మరికొంత నా కొడుకుకు కప్పేదాన్ని.

చలికాలంలో కప్పుకోవడానికి నా మేనత్త మాకు రెండు దుప్పట్లు ఇచ్చింది - అని భావోద్వేగంతో జీవిబెన్ చెప్పింది.

**కరువు సవాలునుంచి బ్రతికి బయట పడటం :**

వారి జీవితంలో ఐదుసార్లు కరువును చూశారు. వాటిలో మూడు చాలా భయంకర మైనవని చెప్పారు. ఆ సమయంలో వారిద్దరు విరాంగవ్ గ్రామంలో పనిచేసేవారు. జీవిబెన్ పొలము గట్లు కట్టేది. అక్కడ ధాన్యానికి రేషన్ ఉండేది. ఆ ఊరి పొలిమేర లోపే అదికూడా రెండున్నర కేజీల ధాన్యానికి మాత్రమే అనుమతి ఉండేది. 20 కేజీల ధాన్యాన్ని నెత్తిమీద పెట్టుకొని విరాంగమ్ నుండి మిథాఘోడు వరకు వెళ్ళే సంఘటనను ఆమె గుర్తు చేసుకొంది. "రాణీ లక్ష్మీబాయి లాగా నా ఇద్దరు కూతుళ్ళను వీపుకు కట్టుకొని ధాన్యము నెత్తిమీద పెట్టుకొని మోశాను. దారిలో ఒక తెలీని వ్యక్తి పోలీస్‌కు నా గురించి విచారించమని సంజ్ఞలతో చూపాడు. పోలీస్ నన్ను గట్టి అరిచి పిలిచాడు. అతన్ని పట్టించుకోకుండా వెంటనే నేను రైలు ఎక్కేశాను. నేను చెవిటి దాన్నని ఇంకొక పోలీస్ అతనితో అన్నాడు. తర్వాత టికెట్ కలెక్టర్ టికెట్ కోసం నన్నడిగినపుడు ఆహారం కొనడానికి డబ్బు లేనపుడు నేను టికెట్ ఎలా కొంటాను అని చెప్పాను. ఖర్గోడులో రైలు దిగి మిథాగొడ వరకు నడిచాను. రాత్రి చిమ్మ చీకటిలో ఇంటికి చేరాను. నాకు అప్పుడు 30-35 సంవత్సరాల వయసు. ఇంకా ఆమె ఆరోజులనే ఇష్టపడుతుంది. ఎందుకంటే అప్పుడు ధరలు చాలా చవకగా ఉండేవి. ఆమె కొన్ని ధరలు ఇలా వివరించింది. "ఒక రూపాయికి 85 కిలోల బెల్లము లేక 10 కిలోల ధాన్యము వచ్చేవి. 93. గ్రా. బంగారు 50 రూ.లకు 280 గ్రా. వెండి ఒక్క రూపాయకు వచ్చేది.

**భూస్వామ్య వ్యవస్థపై వ్యాఖ్యలు :**

ఇద్దరూ ఉప్పు కార్మికులు. 1940 నుండి 1950 వరకు ఒక దశాబ్దము పాటు వాళ్ళు పొలం పని కూలీలుగా పనిచేశారు. 50 సంవత్సరాలు దాచి ఉంచిన డబ్బు సరిపోయిన పుడు హర్భ భాయి 60 రూపాయలు ఖర్చు చేసి రెండు భూభాగాలు కొని రెండు చిన్న ఇళ్ళు నిర్మించాడు. ఒక ట్రక్కు, ఒక ట్రిప్‌లో తెచ్చే మట్టికంటే ఎక్కువ మట్టిని తన తల్లిదండ్రులు ఏ సహాయము లేకుండా మోసుకొచ్చారు. భూస్వామ్య పద్ధతిపై దృష్టితో వారిలా చెప్పారు. "దయాభామ్ పొలములో మేము కూలీలుగా ఉన్నాము. ఆ రోజుల్లో జింజువాద రాష్ట్ర భూభాగంలో మా మిథాగొడ గ్రామం ఉండేది. కోతల సమయంలో దర్బారు (భూస్వామి) నుండి ఒక మనిషి వచ్చి పంటను కొలిచేవారు. మా గ్రామమునుండి పండిన మొత్తం పంటలో సగభాగము దర్బారుకు తీసుకుపోయేవారు". దయాభాయ్ పులములో వారు ప్రత్తి, జొన్నలు, మరియు చిక్కుళ్ళు పండించేవారు. డెబ్భై వేసవులను చవిచూసిన తర్వాత హర్భ భాయి 5000 రూపాయలకు 25 బిఘాల భూమిని కొన్నాడు. ఈ రోజు ఒక బిఘ ధర 30 వేల రూపాయలు పలుకుతుంది. అతడు ఈ భూమిని కొందరు రైతులకు లీజుకిచ్చాడు. వారి ఆదాయంలో తన భాగాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటాడు.

**పిల్లల అభివృద్ధి :**

జివిబెన్ ఇలా గుర్తు చేసుకొంది. "నా పిల్లలు సారములేని ఎండిపోయిన రొట్టెలు తిని పెరిగి పెద్దయ్యారు. పనినుంచి మేము తిరిగి వచ్చేవరకు మాకోసం ఎదురు చూస్తూ ప్రతిరోజు ఏడుస్తూ ఉండేవాళ్ళు". ఆ రోజుల్లో జివిబెన్ రెండున్నర రూపాయలకు ఒక చక్కీ (ధాన్యము పిండి చేసేమిల్లు) కొనింది. వాళ్ళు వాళ్ళ కొడుకును మాత్రమే 10వ తరగతి వరకు చదివించగలిగారు. ఒక కరువు సమయంలో వాళ్ళు వాళ్ళ నివాసాన్ని మార్చేటపుడు కొడుకు చదువు ఆగిపోకుండా పాటడిలో ఒక బడిలో అతనిని వదిలి వెళ్ళారు. ఆ సమయంలో ఆమె కొడుకుకు ఒక జత బట్టలు మాత్రమే ఉండేవి. వాళ్ళ కూతుళ్ళ పెళ్ళిల్లు అయిపోయాయి. వాళ్ళు వారి వారి ఇళ్ళల్లో ఒక మోస్తరుగా సంతోషంగానే ఉన్నారు. ఆ రోజుల్లో ఆసుపత్రులుండేవి కావు. కావున ఎప్పుడైనా పిల్లలకు జ్వరం వస్తే తాజా నిమ్మ ఆకులను పిసికి నీళ్ళల్లో రాత్రంతా నానబెట్టి కషాయం చేసి వారికిచ్చేది. వారికి ఏదైనా అవయవాలు బెణికినపుడు దగ్గరలో వున్న గుడినుండి ఆమె కస్తూరి తెచ్చి నీళ్ళలో కలిపి ఇచ్చేది కడుపు నొప్పికి గేగ్డా విత్తనాలు మిరయు కాంక్షనో గోలో విత్తనాలు నూరి ఆముదము కలిపి దానికి నీళ్ళు తోడు చేసి బాధ పడుతున్న బిడ్డతో త్రాగించేది. ఆమె ఇప్పటివరకు టీ రుచి చూడలేదు. వారికి రెండు గేదెలుండేవి. వారు నెయ్యి తయారు చేసి అమ్మేవారు. ఒకసారి ఒక గేదె తినడం, త్రాగడం మానివేసినపుడు, తినే నూనెలో రెండు కర్పూరం గుండ్లు వేసి బాగా వేడి చేసి ఆ రసాయనాన్ని ఆ గేదె పొట్టకు రుద్ది పట్టించింది. ఆమె తన శరీరంలో కూడా ఏ భాగంలోనైనా నొప్పిగా ఉంటే అలాగే చేసేది.

**పరిసరాలపై శ్రద్ధ :**

ఆరోజుల్లో వాతావరణ పరిస్థితులు వర్ణిస్తూ వారు చెప్పారు "ఈరోజుల్లో ఎడతెగకుండా ఒక గంట వర్షం పడటం కూడా కష్టమే. మా బాల్యంలో ఆగకుండా ఒక నెలరోజులు అలాగే వర్షం కురవడం మేము చూశాము. ఆ రోజుల్లో వాతావరణం చాలా చల్లగా ఉండేది. గత 30-35 సంవత్సరాలలో వాతావరణ ఉష్ణోగ్రత బాగా పెరిగి పోయింది. పంటలను బాగా విధ్వంసం చేసిన కిలీ ఆంధీస్‌ను కూడా ఎదుర్కొన్నాము. "నేలతల్లి నుండి వివిధ మొక్క జాతులను ఖాళీ చేయడం, చెట్లను నిరంతరం కొట్టివేయడం చూసి ఈ జంట ఎంతో బాధ పడింది. ఈమధ్య కాలంలో మిథుజారు, గిండి, ఘరాఫ్, మరియు గేగ్డి వంటి కొన్ని మొక్కలు కనిపించటం



పిల్లలు కళ్ళద్దాలతో పుడుతున్నారు. మేము ఎప్పుడూ అవి పెట్టుకోలేదు ఎందుకంటే మా కళ్ళను బలహీనం చేసే చెడ్డ అలవాట్లు మాకు లేవు" అని.

జివిబెన్ అంటుంది – "మేము ఎప్పుడూ ఎలాంటి సబ్బు వాడలేదు. బట్టలు పిండటానికి నల్లమట్టి ఉపయోగించాము. నేను నల్ల మట్టికి మజ్జిగ కలిపి నా వెంట్రుకలు శుభ్రం చేసుకునేదాన్ని" యువకులకు ఏదైనా సలహా ఇవ్వమని అడిగిన మీదట హర్భ భాయ్ ఇలా చెప్పాడు "నేను సలహాలివ్వను ఎందుకంటే నేటి యువత వినరు. కానీ వాళ్ళు తెలివిగా డబ్బు ఖర్చు పెట్టుకోవాలి. లేకపోతే పెద్ద అప్పులలో పడిపోతారు. శాంతి, సహజీవనాలతో జీవించాలి". జివిబెన్ ఇలా సలహా ఇస్తుంది "పిల్లలు అందరినీ గౌరవించాలి, సామాన్యమైన బట్టలు ధరించాలి".

లేదన్నారు. తన గ్రామంలో గుంటచుట్టూ పెరిగే వాము తినే ప్రత్యేకమైన గడ్డి విత్తనాలతో కిచిపీ పండుతుంది. ఆ గడ్డి ఎక్కడా పెరగడం లేదు. ఇంతకుమునుపు తరచుగా కనిపించే సిమఇ బిలాడి, నార్ జాతి, జరాభ వంటి జంతువులు మరియు మిడుతల, కీటకాలు కూడా ఇపుడు కనిపించటం లేదని హర్భభాయి చెప్పాడు. ఈ రోజుల్లో చిరుతలు, తోడేళ్ళు, ఇంకా రాబందులు కూడా ఎక్కువగా కనిపించటం లేదు.

**తమ జీవితంలోని వెలుగులు (జీవితాన్ని వెలిగిస్తూ) :**

హర్భభాయి, జివిబెన్‌లు వారి జీవితంలోని కొన్ని ఉల్లాసకరమైన సందర్భాలను మాతో పంచుకున్నారు. హర్భభాయి గర్వంగా ఇలా చెప్పాడు "నేను కోపంతో ఉన్నపుడు ఆమె నాకు సర్ది చెపుతూ భోజనం చేయమని ప్రార్థిస్తూ వుంటుంది" జివిబెన్ ఇలా చెప్పింది "ఇతడు ముక్కోపి అయితే నేను నా జీవితమంతా ఇతరుల క్రోధాన్ని సహించానేగానీ తిరగి ఎప్పుడూ బదులివ్వలేదు" ఆమె రామాయణం వంటి మత సంబంధమైన నాటికలు చూడటానికి ఇష్టపడుతుంది. దానికి హర్భ భాయి ఇలా ఎగతాళి చేశాడు" శివుడు నీ భక్తికి మెచ్చి ప్రత్యేకమైన విమానంలో తీసుకెళతాడులే" అని.

ఒకసారి సూరత్‌లో స్టేట్ రిజర్వ్ పోలీస్‌లో పని చేస్తున్న వారి కొడుకు మెహ్రాభాయ్ తన ఇంటికి తీసుకు వెళ్ళాడు. జివిబెన్ అక్కడ ఆనందంతో ఉండేది. చాలా కష్టపడేవాడు. అందుచేత అతడు తిరిగి మిథగోడకు వచ్చేశాడు. రెండుమూడు నెలల తర్వాత జివిబెన్ అతన్ని అనుసరించింది. తిరిగి వచ్చేసింది. ఈ వయసులో కూడా జివిబెన్ అన్ని ఇంటి పనులు స్వయంగా చేసుకుంటోంది. ఆమె ఇలా అంటుంది "కిచడీ మరియు భజియా వండుకోవడం నాకు ఇష్టం" అని. హర్భ భాయ్ దానికి సమాధానంగా "ఎందుకంటే మాకు వేరేవి తినడానికి పళ్ళు లేవుగా" అని అంటాడు.

జివిబెన్ చాలా అలసిపోయింది. ఇప్పుడన్నీ బాధలే. ఆమె ఇలా అంటుంది "నేను చావడానికి క్యూలో సిద్ధంగా ఉన్నాను. కానీ, నా కోర్కెను దేవుడు పట్టించుకోవట్లేదు అని. హర్భ భాయ్ ఇలా అంటాడు నేను చాలా తృప్తిగా ఉన్నాను, కానీ నా శరీర అనారోగ్యం వల్ల బాధ పడుతున్నాను" కొత్తతరం వారి గురించి తమాషాగా ఇలా అంటాడు "ఇప్పుడు

## గ్రామాల్లో వయోవృద్ధులు

**జివిబెన్ – హర్భ భాయి మక్వానా లాగా మన గ్రామాల్లో కూడా 90 ఏళ్ళు, ఆపై వయస్సుగల వృద్ధులు ఉంటారు. వారితో కబుర్లలోకి దిగండి భవిష్యత్ తరానికి కావలసిన ఎన్నో విషయాలు వాళ్ళ జ్ఞాపకాల్లో నిక్షిప్తమై ఉంటాయి. వారిని గురించి తెలుసుకుని వారి కథ మాకు వ్రాస్తే పత్రికలో ప్రచురిస్తాం.**

**'ఒక వృద్ధుడు మరణిస్తే ఒక గ్రంథాలయం తగలబడిపోయినంత' అన్న విషయాన్ని పాఠకులు గుర్తిస్తే వృద్ధుల సలహాలను తప్పకుండా తీసుకుంటారని ఆకాంక్షిస్తున్నాము.**

**-ఎడిటర్**

# కరెంట్ షాక్ వల్ల మరణాలను నివారించే




## ముప్పారపు రాజు
## రిమోట్ మోటార్ స్టార్టర్

ప్రస్తుతం రైతులు చాలామంది తమ వ్యవసాయ బావుల వద్ద తమ వ్యవసాయ మోటార్‌ని స్టార్ట్ చేసుకోవడానికి వెళ్ళి చాలామంది ప్రమాదాలకు గురైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో కరెంట్ షాక్ వల్ల చాలామంది రైతులు చనిపోవడం కూడా జరుగుతోంది. సగటున వారంలో ఇద్దరు రైతులు కరెంట్ షాక్ వల్ల చనిపోవటం మనం చూస్తున్నాం.

ఈ ప్రమాదాలకు అడ్డు కట్ట వేయాలన్న ఉద్దేశ్యంతో హనీబీఏపి ఇన్నోవేటర్ ముప్పారపు రాజు ఒక రిమోట్ కంట్రోల్‌ను కనుగొన్నాడు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలానికి చెందిన రాజమల్లు కుమారుడు ముప్పారపు రాజు. వీరికి వాళ్ళ ఊర్లో ఎలక్ట్రికల్ షాపు ఉంది. ఈ గ్రామం అన్నిటా వెనుకబడి ఉన్న గ్రామం. అతను పాఠశాలకు వెళుతున్నప్పుడే అప్పుడప్పుడు షాపులో ఉండాల్సి వచ్చేది అలా అక్కడ ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలపై అవగాహన పెంచుకున్నాడు. స్వతహాగా ఇతనికి ఎలక్ట్రిక్ పరికరాలంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు వాటితో ఏదో ఒకటి తయారు చేసి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనేవాడు. తన సమీప గ్రామమైన వెంకటాపురం గ్రామంలోని సాహితి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివాడు.

ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉండగా తన స్నేహితుని తండ్రి పొలం దగ్గర మోటార్ స్టార్ట్ చేయబోయి కరెంట్ షాక్‌కు గురై చనిపోయారు. అప్పుడు తీవ్రంగా కలత చెందిన రాజు ఈ ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు తీవ్రంగా ఆలోచించి, చివరకు ఒక పరికరం తయారు చేశాడు. కాని మొదట్లో అది సరిగ్గా పని చేయలేదు. ఇంకా వేరే పరికరాలు కొనాలంటే తనవద్ద డబ్బు లేదు. చివరకు దుగ్గొండి సబ్ ఇన్‌స్పెక్టర్ గారైన ఫణీందర్ గారు ఈ పరికరం తయారు చేయించే బాధ్యతను తీసుకున్నాడు. ఆగస్టు 12, 2005న రిమోట్ సహాయంతో మోటార్ నడిచేట్టు విజయవంతంగా తయారు చేసిన





పరికరాన్ని ప్రదర్శించాడు. కాని అప్పనుండి నేటి వరకు కూడా దీనికి ఎటువంటి గుర్తింపు రాలేదు. 2008 జనవరిలో తమిళనాడులోని అన్నామలై యూనివర్సిటీలో జరిగిన "నేషనల్ టాలెంట్ ఐడెంటిఫికేషన్" కు ఎంపికై అక్కడ వి.సి. గారైన రాధాకృష్ణన్ చే ప్రశంసలు అందుకున్నాడు. ఇప్పుడు రాజు సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు. తన కళాశాల ప్రిన్సిపాల్ గారైన కాది గోపాల్ రెడ్డి గారు రాజును ఎంతో ప్రోత్సహించారు. రాజు డిగ్రీ మొదటి సంవత్సరంలో ఉండగా ఇంట్లో బీరువా ఎవరైనా తెరిస్తే మొబైల్ ఫోన్‌లో అలర్ట్ మెసేజ్ వచ్చేలా ఒక పరికరాన్ని కూడా తయారు చేశాడు. 2008లో అడవుల్లో వేటగాళ్ళు కుందేళ్ళు, జింకల కోసం అమర్చే ఎలక్ట్రిక్ ఉచ్చుల్ని కనుగొన్నాడు. దీనివల్ల అడవుల్లో కూంబింగ్ చేసే పోలీసులు మరియు ప్రజలు ఈ ఉచ్చుల బారినుండి తప్పించుకోవచ్చు. 2006 లో ఏటూరు నాగారం అడవుల్లో వేటగాళ్ళు అమర్చిన ఎలక్ట్రిక్ ఉచ్చుల్ని తాకి ఒక కానిస్టేబుల్ చనిపోయాడు. దీన్ని ప్రేరణగా తీసుకొని పవర్ డిటెక్టర్ అనే పరికరం తయారు చేశాడు.

## రిమోట్ స్టార్టర్ పనిచేసే విధానం :

వ్యవసాయ బావుల వద్ద ఉన్న మోటార్ సెట్లని దూరంగా ఉండే రిమోట్‌తో స్టార్ట్ చెయ్యవచ్చు మరియు ఆపేయనూ వచ్చు. ఈ పరికరం "రేడియో ఫ్రీక్వెన్సీ" ద్వారా పని చేస్తుంది. రిమోట్‌లో ఉండే ట్రాన్స్‌మీటర్ ఆర్.ఎఫ్. సిగ్నల్స్‌ని ప్రొడ్యూస్ చేస్తుంది. ఆ సిగ్నల్‌ని స్టార్టర్ దగ్గర ఉన్న రిసీవర్‌లో వచ్చిన సిగ్నల్స్‌ని తీసుకుని రిసీవర్ పని చేస్తుంది.



**ఉపయోగాలు :**

- అతి తక్కువ ధరలో తయారు చేసుకోవచ్చు.
- పరికరంతో కరెంట్ షాక్‌ల భారినుండి రైతులు తమ ప్రాణాలు కాపాడుకోవచ్చు.
- తరచూ బావి విద్దకు వెళ్ళి రిమోట్‌ని ఆన్, ఆఫ్ చేయాల్సిన అవసరం లేదు. ఉన్న చోటునుండే మోటార్‌ను పని చేయించవచ్చు.
- రిమోట్‌లో బ్యాటరి ఉంటుంది. ఒక్క బ్యాటరి 40 రోజులు వస్తుంది. బ్యాటరీ ఖర్చు 10 రూపాయలు.

**సూత్రం :** రిసీవర్‌లో మోటార్‌ను ఆన్, ఆఫ్ చేయడానికి రెండు రిలేలు ఉంటాయి. ఇవి ఆన్ అయినప్పుడు మోటార్ ఆన్ అవుతుంది.


ఇన్నోవేటర్ చిరునామా : ముప్పారపు రాజు, తండ్రి రాజమల్లు, గోపాలపురం గ్రామం, దుగ్గొండి మండలం, వరంగల్ జిల్లా. సెల్ : 98859 35482, 99480 13070.

**రెండు నెలల క్రితం మదన్ మోహన్ రెడ్డి అనే నిజామాబాద్ జిల్లాకు చెందిన రైతు బ్రిగేడియర్ గణేశంని కలసి రైతులు స్టార్టర్ షాకుతో ఎలా అకారణంగా, నిస్సహాయులుగా చనిపోతున్నారో చెపుతూ కనీళ్ళు పెట్టుకున్నాడు. దాదాపు మన రాష్ట్రంలో 27 లక్షలు, దేశంలో నాలుగు కోట్ల మంది రైతులు మోటార్లు వాడుతున్నారు. కరెంటు షాకుతో మృతి చెందిన రైతుల సంఖ్య సరిగ్గా అంచనా వేయలేక పోయినా కనీసం రోజుకొకటైనా వుంటుంది. ఇలాంటి సందర్భంలో రాజు తయారు చేసిన పరికరం ఎంతో ఉపయోగ కరంగా వుంటుంది. రైతుల ప్రాణాలను కాపాడుతుంది. రెండు వందల రూపాయల్తో రైతుల క్షేమం లభిస్తే మనం వెనకా ముందు చూడొద్దు. రాజును మదన్ మోహన్ రెడ్డి గ్రామానికి బ్రిగేడియర్ పంపారు. ఈ పరికరం అక్కడ అమర్చి ఫలితాలను గమనిస్తున్నారు. –ఎడిటర్**

# ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు

**రెండుసార్లు నాటు వేయటం ద్వారా 'క్యాబేజి, క్యాలీఫ్లవర్' పంటల అధికోత్పత్తి :**

ఒరిస్సాలోని సుందర్‌ఘర్ ప్రాంతంలోని స్థానిక కొండజాతివారు క్యాలిఫ్లవర్, క్యాబేజీ పంటల అధికోత్పత్తికి ఈ పద్ధతిని



ఉపయోగిస్తున్నారు. ముందుగా విత్తనాలను నారుమడిలో పోసి మారాకులు మొలకెత్తిన తర్వాత ఆ మొలకలను జాగ్రత్తగా తీసి ఇంకొక మడిలో నాటాలి. అక్కడ మొక్కకి దాదాపు ఎనిమిది ఆకులు వచ్చేవరకు ఉంచాలి. ఆ తర్వాత వాటిని తీసి పొలంలో నాటినచో ఆ మొక్క బలంగా, ఆరోగ్యంగా ఉండటంతో పాటు, అధికోత్పత్తిని ఇస్తుంది. షెడ్యూల్డు తెగలకు చెందిన రైతు గణనాథ గత ఐదు సంవత్సరాలుగా ఈ పద్ధతిని ఉపయోగించి అధికోత్పత్తిని సాధించాడు.

**కాకర ఆకుల రసంతో పశువుల పుండ్లకు వైద్యం :**


పశువులకు దెబ్బలు, పుండ్లను అలాగే వదిలేస్తే అవి చీము పట్టి సెప్టిక్ అయ్యే ప్రమాదముంది. ఒరిస్సాలోని తర్చర్ అనే గ్రామ ప్రజలు తాజా కాకర ఆకులను దంచి ఆ ముద్దను పశువుల పుండ్లు, గాయాలపై పూయటం ద్వారా అవి త్వరగా మానిపోవటం జరుగుతోంది. దీనివలన గాయాలు త్వరగా మానటమే కాకుండా, క్రిమి కీటకాలను కూడా



చేరనివ్వకుండా నిరోధిస్తుంది. ముద్దగానే కాకుండా కాకర ఆకులను చేతితో నలిపి ఆ రసాన్ని గాయంపై వేస్తే కూడా గుణం కన్పిస్తుంది. ప్రకాష్ అనే రైతు ఈ పద్ధతిలో చాలా పశువులకు ఉపశమనం కలిగించాడు.

**నిమ్మజాతికి చెందిన దబ్బ(కర్ణ) కాయ చెట్ల ఆకులతో పశువులలో నులిపురుగుల నివారణ:**

ఒరిస్సా రాష్ట్రంలోని పూరి, అంగూల్, కలహంది ప్రాంతాల్లోని ప్రజలు దబ్బ (కర్ణ) కాయలను ఆహారంలో వాడుతారు. కానీ లక్ష్మీబెన్ (49 సం.) ఈ చెట్ల



ఆకులను పశువులలో నులి పురుగుల నివారణకు వాడుతుంది. ఆమె మూడు నాలుగు ఆకుల రసానికి కొద్దిగా ఉప్పు కలిపి 150 మి.లీ. నీటిలో కలిపి జ్యూస్‌ను తయారు చేసి పశువులకు తాగిస్తుంది. దీంతో పశువుల కడుపు శుభ్రపడి కడుపు నొప్పితో పాటు నులి పురుగులు కూడా నివారించబడతాయి. ఈ పద్ధతిలో ఈమె ఎన్నో దూడలకు వైద్యాన్ని చేసింది.

**నీరు కావలసినపుడు చెట్లు కూడా సెల్‌ఫోన్‌కు యస్‌యంయస్ ఇస్తాయి !**

ఇజ్రాయిల్‌కు చెందిన వృక్షశాస్త్రవేత్త డా. ఏరన్ రవే, భూగర్భ శాస్త్రవేత్త డా. ఆర్యే నాడ్లర్‌లు సమిష్టిగా ప్రయోగాలు చేసి చెట్లు తమకు అవసరమైనపుడు రైతు కంప్యూటర్‌కు గానీ, సెల్‌ఫోన్‌కు గానీ యస్.యం.యస్.



ద్వారా తమ అవసరాన్ని తెలియజేసే పద్ధతిని రూపొందించారు. సుత్తిలాంటి ఓ చిన్న పరికారన్ని చెట్లు బుడములో గాని, వేరులో గాని అమర్చడం ద్వారా ఇది సాధ్యపడుతుంది. వీరిరువురు ఈ పద్ధతిని చవకగా ఇళ్ళల్లో వాడటానికి, వాణిజ్యపరంగా వాడటానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నారు. అమెరికాలోని క్యాలిఫోర్నియాలోని రైతులు ఈ పద్ధతిని అరటి, మామిడి, చీని పంటలలో వాడటానికి ఉత్సాహం చూపుతున్నారు. ఈ పద్ధతివలన నీటి వినియోగపు ఖర్చు 50 శాతం వరకు తగ్గించవచ్చునని, అది కరువు ప్రాంతాల్లో చాలా ఉపయోగకరంగా వుంటుందని దీని రూపకర్తలు అంటున్నారు.

# స్పందన

**గౌరవనీయులైన బ్రిగేడియర్ గణేశం గారికి,**

మీకు, మీ కుటుంబ సభ్యులకు 2010 నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ సందర్భంగా ఆరోగ్యాన్ని గురించి కొన్ని ఆలోచనలు పంచుకోవలెననుకుంటున్నాను. ఆరోగ్యం పలు సామాజిక, ఆర్థిక, నైతిక మరియు సమానత అంశాలపై ఆధారపడి ఉంటుంది. వైద్యం కూడా ఒక అంశం మాత్రమే.

దురదృష్టవశాత్తు ఇప్పుడు చాలా సమాజాల్లో తెలిసో – తెలియకో "వైద్యమే ఆరోగ్యము" అన్నట్లు చాలామంది ఆలోచిస్తున్నారు. వైద్యం వల్ల మనకు లభించేది "వైద్య ఆధారిత ఆరోగ్యం" మాత్రమే.

ఈ వైద్యం కూడా ఎలాంటి నైపుణ్యం – నాణ్యత లేకుండా, నీతి తప్పి వ్యాపార వస్తువులాగా కునారిల్లుచున్నది. ప్రతి బాధకూ వైద్యం, అనవసరపు మందులు, పరికరాలు – ఆపరేషన్‌లు, సేవకంటే లాభానికే ప్రాధాన్యత, వైద్యంతో పేదరికం, వైద్యంతో రోగాలు – చావులు, అంకిత భావం – జవాబుదారీతనం లేని వైద్యంపై మందుల కంపెనీల – పరికరాల కంపెనీల ప్రభావం, రోగి వైద్యుడి మధ్యన మంచి మానవ సంబంధాలు లేకుండుట లాంటి రుగ్మతలతో మనిషికి "వైద్య ఆధారిత ఆరోగ్యం" లభిస్తుంది. వీటినుంచి విముక్తి సాధిస్తేనే మనిషికి సరియైన "వైద్య ఆధారిత ఆరోగ్యం" లభిస్తుంది.

ప్రజలను వైద్యానికీ – డబ్బుకూ సంబంధం లేని ఆరోగ్యాన్ని గురించి చైతన్యం చేయుటకు నవంబర్ 1, 2009 నుండి "ఆర్గనైజేషన్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ సోషల్ డైమన్షన్ ఆఫ్ హెల్త్" (ఓ.పి.యస్.డి.హెచ్.) పని చేస్తుంది. ఈ సంస్థ ప్రభుత్వం నుండి ఎలాంటి ఆర్థిక సహాయం తీసుకోదు. సంస్థలో పనిచేసే వారందరూ స్వంత వనరులతోనే పని చేస్తారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ సంస్థ మనసారా మీ భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తుంది. సదా మీ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ.... **– డా. అరవీటి రామయోగయ్య,** వ్యవస్థాపకులు,
మీరూ ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి. ఓపియస్‌డిహెచ్. సెల్ : 98496 69282.

**మీ ప్రయత్నాలు విజయవంతం కావాలని మేము మనసారా ఆశిస్తున్నాం. మా సహాయం ఉడతా భక్తిగా ఎల్లప్పుడూ వుంటుంది.** – ఎడిటర్.

**బ్రిగేడియర్ గణేశం గారికి,**

నేను ఈ ఉత్తరంతో పాటు "పక్షులు – మానవాళి" అన్న ఆర్టికల్‌ను పంపుతున్నాను. దీన్ని 'పల్లెసృజన'లో ముద్రిస్తే పాఠకులకు పక్షులపై అవగాహన కలగడంతో పాటు మానవాళికి వాటి అవసరం, ప్రాధాన్యత, వాటివల్ల మానవాళికి జరిగే లాభాలను గురించి విపులంగా తెలియటంతో పాటు పక్షుల సంరక్షణకు కూడా ఉపయోగ పడుతుందని ఆశిస్తున్నాను. **– యస్. అశోక్ కుమార్,** ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్)

అశోక్ కుమార్ గారూ,

**మీరు పంపిన ఆర్టికల్ చాలా బాగుంది. ఈ పత్రికలో దీన్ని ముద్రిస్తున్నాము. ఇలాంటివి ఇంకా ఎన్నో విశేషాలను పాఠకులకు తెలియజేస్తారని ఆశిస్తున్నాము.** – ఎడిటర్.

**బ్రిగేడియర్ గణేశం గారికి,**

ముందుగా పంపిన 12 నూతన ఆలోచనలలో కొన్ని ప్రచురించినందుకు ధన్యవాదములు. ఈసారి ఒక కొత్త సాంప్రదాయం "సైంటిఫికిజమ్" అనే కొత్త మతం గురించి పల్లెసృజనలో ప్రచురించవలసిందిగా ప్రార్థిస్తున్నాను. మరియు ఎన్.ఐ.ఎఫ్. పోటీకి, ఈ నూతన మత అభివృద్ధికి ఎవరెవరితో సంబంధాలు కుదుర్చుకోవాలో తెలిపి, అనుసంధానం చేయవలసిందిగా కోరుతున్నాను. **– పూసర్ల జనార్ధనరావు,** అరసడ గ్రామం, విజయనగరం జిల్లా.

**మీ "సైంటిఫికిజమ్" ఎన్.ఐ.ఎఫ్. పరిధిలోకి రాదు. అయినా మీ ఆలోచనను పాఠకులకు అందిస్తున్నాము.** – ఎడిటర్

**బ్రిగేడియర్ గణేశం గారికి,**



హనీబీఏపి సంస్థ ప్రచురిస్తున్న పత్రిక 'పల్లెసృజన' పేరుకు తగ్గట్టుగానే సృజనాత్మకమైన పత్రిక. మన గ్రామాలలో వుండే ఎంతోమందిలో బయటకు రాక ఆగిపోయిన లేక ప్రచారంలోకి రాని సృజనాత్మకతను వెలికి తీసి ఎన్నో ఉపయోగకరమైన అంశాలను వెలుగులోకి తీసుకు రావటానికి ఎంతగానో ఉపయోగపడుతున్న సంచిక ఇది. నిత్య జీవితంలో అవసరమైన చిట్కా వైద్యాలను, మూలికా వైద్యాలను అందరికి అందించటానికి కృషి చేస్తోంది. వ్యవసాయదారులకు షవసరమైన సస్యరక్షణ చర్యలను ఇంకా తక్కువ ఖర్చుతో, అందుబాటులోనున్న వస్తువులతో తేలికగా ఉపయోగించుకోగల వ్యవసాయ పనిముట్లను, వాటిని తయారు చేసిన రైతు మిత్రులను వెలుగులోకి తీసుకు వస్తోంది. మన రాష్ట్రానికి సంబంధించిన విశేషాలనే కాకుండా, ఆ ఇన్నోవేషన్స్‌కి ప్రచారం కల్పించి అనేక రైతు సదస్సులలో ప్రదర్శింపజేసి, ఆ వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యాలను కలిగించడానికి కృషి చేస్తున్న సంస్థ హనీబీ. ఇది మాత్రమే కాక, పల్లె ప్రజల్లో మరుగున పడివున్న సృజనాత్మకతను వెలికి తీయటానికి 'సాంకేతిక ఆవిష్కరణల పోటీ' నిర్వహించడానికి నడుం బిగించింది. ఇందుకుగాను నిస్వార్థంగా కృషి చేస్తున్న హనీబీ సంస్థ నిర్వాహకులు మరియు 'పల్లెసృజన' పత్రిక సంపాదకవర్గము అభినందనీయులు. ఈ పత్రిక పల్లె పల్లెకు చేరి, అందరికీ అందుబాటులోకి రావటానికి అందరం పాటుపడాలి. ఇందుకు నావంతు కృషి ఎల్లప్పుడూ వుంటుంది. **– పింగళి పద్మావతి,** యం.బి.–1, రైలుర్ బస్తీ, కొత్తగూడెం.

## 'హనీబీఏపి' అంతరాత్మ

# పల్లె సృజన

'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' సంస్థ లక్ష్యాలను సాధించటానికి 'హనీబీ' (తేనెటీగ) అనే పేరుతో ఒక యంత్రాంగం రూపొందించబడింది. తేనీటీగ అత్యుత్తమ నిస్వార్థ ప్రాణి. పూలల్లో వున్న మకరందాన్ని ఆస్వాదించి, తన శ్రమతో దాన్ని తేనెగా తయారు చేసి మానవాళికి అందజేస్తుంది. మూవుకు నష్టం వాటిల్లకుండా, ప్రజానీకానికి లాభమయ్యేటట్లుగా చాకచక్యంతో కార్యాన్ని నిర్వర్తిస్తుంది. ఈ తేనెటీగ జీవన సరళియే ఉద్దేశ్యంగా 'హనీబీ' స్వచ్ఛంద సంస్థ మరుగున పడివున్న గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయకంగా వాడే పద్ధతులు, సృజనాత్మక ఆలోచనలను వెలికి తీయడానికి కృషి చేస్తున్నది. ప్రజలనుండి మనం ఏదైనా జ్ఞానాన్ని సేకరించినపుడు, వారు గరీబులుగా మారకూడదు. వారి అంతరాంతరాల్లోని ఆలోచనల్ని మనతో పాలు పంచుకొన్నప్పుడు వారికి అంతో ఇంతో లాభం జరగడం సబబు. అందుకే మనం వారి సరికొత్త ఆలోచనలను వారి స్థానిక భాషలోనే చర్చించాలి. వారికి తగిన సమాచార సామగ్రిని అందించాలి. సరికొత్త ఆలోచనలన్ని మనముందు వెల్లడిస్తున్న వ్యక్తికి ఆ ఆలోచనలతో మనమేమి చేస్తామో తెలియాలి. వారి పరిజ్ఞానాన్ని విస్తారం చేయడం ద్వారా ఎంతోకొంత ఆదాయాన్ని వీరికి సమకూర్చాలి. ఇది వీలైనంత పారదర్శకంగా ఉండాలి.

ప్రజల మధ్య అభ్యాసానికి 'పల్లెసృజన' ఒక ప్రయోగం వంటిది. మనం ఇంగ్లీషులో రాస్తాము. అది ప్రపంచమంతటికి వ్యాపిస్తుంది. కానీ, స్థానికులను పరాయి వారిని చేస్తుంది. మనం ఎక్కడి నుండి నేర్చుకున్నామో అక్కడికి చేరుకోలేము. ఒకవైపు మనం ఎదుగుతూ ఉంటాం. కెరీర్‌లో ఒక్కొక్క శిఖరాన్ని అధిరోహిస్తాము. వృత్తి సంబంధమైన పురస్కారాల్ని అందుకుంటాము. ఇదే సమయంలో మన ఆలోచనలలో భాగస్వామి అయినా స్థానికుడు బాధలు పడతాడు. మౌనంగా వేదనకు లోనవుతాడు. విజ్ఞాన సేకరణ, దాన్ని పత్రరూపంలో సిద్ధం చేయడం (డాక్యుమెంటేషన్), ఆ విజ్ఞానాన్ని నలుదిశలా వ్యాపింపజేయడం, వాటికి సిద్ధాంతాల్ని, రూపాన్ని కల్పించడం, సంస్థలకు పరిచయం చేయడం, నైతిక సూత్రాల పాటింపు, హనీబీ ఆలోచనల్లో ప్రధానమైనవి. ఈ విజ్ఞానాన్ని విస్తారంగా ప్రచారం చేయడానికి 'పల్లెసృజన' తెలుగునాట కృషి చేస్తున్నది. హనీబీ యంత్రాంగానికి చేయూత నందించాలి. అనుకున్నట్టయితే మీరూ మా పత్రిక వార్షిక చందా లేదా జీవత కాలపు చందాలతో ముందుకు రండి. మీ సృజనలను, ఆలోచనలను మాకు ప్రచురణకై పంపండి.

### చందా వివరాలు

| | | వ్యక్తిగతం | సంస్థ / లైబ్రరీ |
|---|---|---|---|
| సంవత్సరానికి | : | **100/-** | **1,000/-** |
| రెండు సంవత్సరాలకు (ఒక పాత సంచిక ఉచితం) | : | **175/-** | **1,750/-** |
| మూడు సంవత్సరాలకు (రెండు పాత సంచికలు ఉచితం) | : | **250/-** | **2,500/-** |
| ఐదు సంవత్సరాలకు (నాలుగు పాత సంచికలు ఉచితం) | : | **400/-** | **4,000/-** |

**మీ చందాలను డి.డి. / మనీఆర్డర్ / చెక్కులను**
**"పల్లెసృజన" పేరున హైదరాబాద్‌లో చెల్లునట్లు**
**ఈ క్రింది చిరునామాకు పంపించండి.**

ఎడిటర్, పల్లెసృజన,
102, వాయుపురి, సైనికపురి పోస్టు,
సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 98660 01678
e-mail : honeybeeap@gmail.com


# 'శానిటరీ న్యాప్‌కిన్స్' తయారు చేయడం ద్వారా

# గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకి ఆరోగ్యంతో పాటు వ్యాపారం కూడా.....!!

గ్రామీణ ప్రాంతాల్లోని స్త్రీల ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు ఓ చక్కని ఉపాయాన్ని కనుగొన్నారు తమిళనాడుకు చెందిన మురుగనాథమ్. పదవ తరగతితో చదువు ఆపేసి తన కుటుంబానికి ఆర్థికంగా తోడ్పడ్డాడు. ఇతనికి శాస్త్ర విషయాలన్నా, ఖగోళ శాస్త్రమన్నా మక్కువ ఎక్కువ. చిన్న తనంలోనే ఇతను గుడ్లనుండి కోడిపిల్లలను పొదిగే యంత్రాన్ని కనుగొని బహుమతి కూడా పొందాడు. ఇంట్లో తన భార్య ఇంటి అవసరాల కోసం న్యాప్‌కిన్‌లు కొంటే మరో ఖర్చు తగ్గించుకోవాల్సి వస్తుందని, పాత బట్టలను చించుకుని వాడుతూ వుండటం గమనించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన 'శానిటరీ న్యాప్‌కిన్స్' తయారు చేసే యంత్రాన్ని కనుగొన్నాడు. ఈ యంత్రాన్ని ఇప్పటికే దేశ వ్యాప్తంగా దాదాపు 80 స్వయం సహాయక బృందాలు వినియోగిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో తమ వ్యాపార కార్యకలాపాల్ని సాగిస్తున్నాయి. నలుగురు మహిళలు ఈ యంత్రం ద్వారా నిమిషానికి మూడు న్యాప్‌కిన్‌లు తయారు చేయవచ్చు. ఈ యంత్రం ద్వారా తయారైన న్యాప్‌కిన్ వివిధ రకాల నాణ్యతను బట్టి రూ. 1 నుండి రూ. 1-50పై. వరకు ఖరీదు వుంటుంది. నాణెం వేసి బరువు చూసుకునే యంత్రం లాగా, నాణెం వేస్తే న్యాప్‌కిన్ ఇచ్చే యంత్రాన్ని కూడా కనిపెట్టాడు. వీటిని స్త్రీలు వినియోగిస్తే ఆరోగ్యంతో పాటు గ్రామీణ పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందగలవు. ఈ యంత్రాన్ని తయారు చేసేందుకు యన్.ఐ.ఎఫ్. ఆర్థిక సహాయం అదించింది. స్వయం ఉపాధిని కోరుకునేవారు, స్వయం సహాయక బృందాలు, హనీబీఏపిని లేదా 'పల్లెసృజన' కార్యాలయాన్ని సంప్రదించి పూర్తి వివరాలను పొందగలరు.



– హనీబీఏపి. సెల్ : 9866 00 1678



## ఇగ్నైట్ 10 మొదలైంది

పాఠశాల విద్యార్థులు తమ భావాలను, సూచనలను, పరిశోధనలను, సాంప్రదాయక విజ్ఞానాన్ని ఈ క్రింది చిరునామాకు పంపవలెను.

**నేషనల్ కో-ఆర్డినేటర్**
**(స్కౌటింగ్ & డాక్యుమెంటేషన్)**
**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్**
**బంగళా నెం. 1,**
**శాటిలైట్ కాంప్లెక్స్,**
**ప్రేమ్‌చంద్ నగర్ రోడ్,**
**అహమ్మదాబాద్ - 380 015. గుజరాత్.**
**ఫ్యాక్స్ (079) - 26731903**
ఈమెయిల్ :ignite09@nifindia.org
www.nifindia.org

## సృష్టి యువ యాంత్రిక్ అవార్డు/ యువ సాంకేతిక నిపుణుల అవార్డు

సాంకేతిక విద్యార్థులు (బి.టెక్ / బి.ఎస్‌సి., ఎమ్.టెక్., పిహెచ్.డి.)
వారి వారి సూచనలు / భావనలు, పరిశోధనాత్మక ప్రాజెక్టులు ఈ క్రింది చిరునామాకు పంపవలెను.

బి/హెచ్ ఫార్మసి కాలేజ్ మెస్,
బాలుర హాస్టల్ క్యాంపస్ దగ్గర
యూనివర్సిటీ ఏరియా
నవరంగపుర, అహమ్మదాబాద్ - 380 009.
గుజరాత్ - ఇండియా.
ఫ్యాక్స్ : 079-26307341
ఈమెయిల్ : innovation09@sristi.org
innovationsristi09@gmail.com
website : http//www.sristi.org

## ఎంట్రీలు పంపుటకు చివరి తేది : 31 ఆగస్టు, 2010

**IGNITE 10 has begun.....**

School children may send their ideas, innovations and traditional knowledge practices to ignite09@nifindia.org

**SRISTI YuvaYantriki Award/Young Technologist Award**

Technology students (B Tech/B Sc, M Tech, Ph D) can send their outstanding ideas, innovations and projects, full or summary, ideas and innovations to innovation09@sristi.org, innovationsristi09@gmail.com

## పల్లెసృజన చందా వివరాలు

| | వ్యక్తిగతం | సంస్థ / లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | : 100/- | 1,000/- |
| రెండు సంవత్సరాలకు (ఒక పాత సంచిక ఉచితం): | 175/- | 1,750/- |
| మూడు సంవత్సరాలకు(2 పాత సంచికలు ఉచితం): | 250/- | 2,500/- |
| ఐదు సంవత్సరాలకు(4 పాత సంచికలు ఉచితం) | : 400/- | 4,000/- |

మీ చందాలను డి.డి. / మనీఆర్డర్ / చెక్కులను శ్రీమతి పి. అరుణ గణేశం పేరున హైదరాబాద్‌లో చెల్లునట్లు ఈ క్రింది చిరునామాకు పంపించండి.

అసోసియేట్ ఎడిటర్, పల్లె సృజన
102 , వాయుపురి, సైనికపురి పోస్టు,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 98660 01678
e-mail : honeybeeap@gmail.com

Narendra Graphics, Hyd. Ph. : 93913 75655